ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 27.0
కనిష్ఠం : 24.0

కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా : కలెక్టర్



ఏలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్‌కు వివరించారు. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై ఆయన కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలసలు, ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో ఓటర్లు నమోదు, చనిపోయిన ఓటర్లను తొలగించకపోవడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

డేటా డ్రివెన్ గవర్నెన్స్ అత్యంత కీలకం..

రాష్ట్రపాలనలో భవిష్యత్‌లో డేటా డ్రివెన్ గవర్నెన్స్ అత్యంత కీలకంగా మారుతుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మంత్రులు, ప్రభుత్వ కార్యదర్శులు, కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ఎంజే అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి పాల్గొన్నారు.

తివాచీ పరిశ్రమకు పూర్వవైభవం..

ఒక జిల్లా- ఒక ఉత్పత్తి కేంద్ర ప్రభుత్వం నుంచి ఏలూరు జిల్లా తివాచీ రంగానికి గుర్తింపునిచ్చారని, ఈ రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు.నగరంలోని పెన్షన్ లైన్స్‌లోని లక్ష్మీవారపుపేటలో గురువారం ఆమె ఏలూరు ఫైల్ కార్పెట్ వీవర్స్ కో-ఆపరేటివ్ సేల్స్‌అండ్ పర్చేజ్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన రెండు లూమ్(ఆధునిక మగ్గాలను) ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

ఏలూరుసిటీ : భవిష్యత్ తరాలకు రసాయనిక రహిత ఆహారాన్ని అందించడానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని, జిల్లాను ప్రకృతి వ్యవసాయ హబ్‌గా తీర్చిదిద్దేందుకు నేచర్ వారియర్ బాధ్యతలను మహిళలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. ఐఏడీపీ హాలులో గురువారం ప్రకృతి వ్యవసాయంపై జరిగిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. టీ-ఐసీఆర్‌పీలుగా ఎంపికైన 117 మంది జిల్లాలో నేచురల్ ఫార్మింగ్‌ను ముందుకెళ్లడంలో కీలక పాత్ర పోషించనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగి డిప్యుటేషన్ రద్దు

ఏలూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖలో ఏళ్లతరబడి డిప్యుటేషన్లపై పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరుని పునఃసమీక్షించి ఆరోపణలు వస్తున్న వారిని మాతృస్థానాలకు పంపించే ప్రక్రియను డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం గురువారం ప్రారంభించారు. తొలుత ఎంపీహెచ్‌ఏ (మేల్)విభాగంలో ఉద్యోగుల సర్వీసు విషయాలను పర్యవేక్షించే ఉద్యోగికి డిప్యుటేషన్‌ను రద్దుచేసి, పీహెచ్‌సీ విధులకు పంపించాలని నిర్ణయించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి డిప్యుటేషన్లు వేయలేదని, గతంలో జరిగిన డిప్యుటేషన్లను సమీక్షించి పనితీరు సరిగాలేని ఉద్యోగులను వెనక్కి పంపించివేస్తామన్నారు. శాఖాపరంగా ఉద్యోగులెవరైనా సమస్యలు ఎదుర్కొంటుంటే తనకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు





లింగపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపక్కన ఉన్న పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇటీవల లింగపాలెం శివారు జూబ్లీనగర్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో మండలానికి చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన మరువకముందే అదే ప్రాంతానికి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న పొదల్లోకి దూసుకువెళ్లడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఏలూరు నుంచి సత్తుపల్లికి సుమారు 30 మంది ప్రయాణికులతో వెళుతున్న బస్సు లింగపాలెం శివారు జూబ్లీనగర్ సమీపంలో ముందు వెళుతున్న మరో బస్సును ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. బస్సుడ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని, లేదంటే బస్సు మరింత దిగువకు దూసుకెళ్లి ఉంటే పెద్దప్రమాదం జరిగేదని ప్రయాణికులు తెలిపారు. ఏలూరు నుంచి మరో బస్సును పంపి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు తరలించారు. ఇతర వాహనాల సహాయంతో బస్సును బయటకు తీసి ఏలూరు డిపోకు తరలించారు.

మాకేంటి భయం!

రేషన్ బియ్యం మాఫియా బరి తెగింపు

- పక్కదారి పడుతున్న పేదల బియ్యం
- కేజీ రూ.12 నుంచి రూ.15 వరకు కొనుగోలు
- గుట్టుచప్పుడు కాకుండా రాత్రిళ్లు తరలింపు
- పట్టించుకోని సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు



రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. ఉచితంగా ప్రభుత్వం అందించే బియ్యంకు అధిక ధర ఆశ చూపి కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే బియ్యం నాసిరకమంటూ ప్రచారంతో చీకటి వ్యాపారాన్ని పెంచుకుంటున్నారు. పగలంతా సేకరించిన బియ్యాన్ని రాత్రి సమయంలో దర్జాగా వాహనాలపై తరలిస్తున్నారు. 'ఎవరి పర్సంటేజ్ వారికి అందించాం.. మాకేంటి భయం' అంటూ నిర్భీతితో బియ్యాన్ని సేకరించి తరలిస్తున్నారు. కళ్ల ముందే అంతా జరుగుతున్నా వారిపై చర్యలు శూన్యం.

(జంగారెడ్డిగూడెం రూరల్)

జిల్లాలో మొత్తం 1,123 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెల 9,200 నుంచి 9,500 మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లాలకు సరఫరా అవుతోంది.వీటిలో 8,500 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం చౌక దుకాణాల ద్వారా కార్డులకు అందుతుంది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్డే మీల్స్‌కు సంబంధించి 500 మెట్రిక్ టన్నుల బియ్యం, అంగన్‌వాడీలకు 200 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా జరుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ వాహనాల ద్వారా కార్డుదాలకు ఇళ్ల వద్దకే వెళ్లి చౌక డిపోలకు సంబంధించిన నిత్యావసర సరుకులను అందించేవారు. ఈ క్రమంలో కార్డుదారుల నుంచి ఎండీయూ వాహన నిర్వాహకులు బియ్యాన్ని కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని కూటమి ప్రభుత్వం భావించింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎండీయూ వ్యవస్థనే తొలగించి ఎప్పటి మాదిరిగానే చౌక డిపోల వద్దకు వెళ్లి బియ్యం తెచ్చుకునేలా నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో కొందరు కార్డుదారులు బియ్యంను రేషన్ డీలర్లకే అమ్మేస్తున్నారు. దీనికితోడు 60 ఏళ్లు దాటిన వృద్ధులు, మంచానపడ్డ వారికి ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వా లనే కొత్త నిబంధన కొంతమంది డీలర్లకు బాగా కలిసొచ్చినట్టు చెబుతున్నారు. నేరుగా ఈ-పోస్ మిషన్‌ను వీళ్ల ఇంటికి తీసుకువెళ్లి వారి వేలి ముద్రలు తీసుకుని ఎంతో కొంత సొమ్ము ముట్టచెప్పి వచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇప్పుడు బియ్యం అక్రమ రవాణాలు రెట్టింపైనట్టు సమాచారం.

ఉమ్మడి పశ్చిమ నుంచి తూర్పునకు..

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని వాహనాలపై తూర్పుగోదావరి జిల్లాలోని మిల్లర్లకు, పోర్టుకు తరలిస్తున్నట్టు ప్రచారం. విజిలెన్స్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసినా ఈ దందాకు బ్రేక్ పడడం లేదు. గతంలో రేషన్ బియ్యంను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాటిని రీసైక్లింగ్ చేసి మార్కెట్‌లో విక్రయించేవారు. ఇప్పుడు ఆ వ్యాపారం కాస్త తగ్గి నేరుగా కాకినాడ పోర్టుకు తరలించేందుకు తూర్పుగోదావరికి చెందిన కొంతమంది బడా వ్యాపారస్తులు ఇక్కడ కొంతమంది ద్వారా వ్యాపారాన్ని చేస్తున్నట్టు చెబుతున్నారు. వీరితో పాటు ప్రతి గ్రామంలో బియ్యంను కొనుగోలు చేసే వారు తయారయ్యారు. ఒక లారీ ట్రిప్ లక్ష్యంకు చేరితే రాత్రికి రాతే లక్షల్లో ఆదాయం వస్తుంది. దీంతో కేసులు పెట్టినా పట్టించుకోకుండా ఈ చీకటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

కిలోకు రూ.15

ఒకప్పుడు రేషన్ బియ్యం కిలోకు రూ.8 నుంచి రూ.10లు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం కేజీ రేషన్ బియ్యం రూ.15 నుంచి రూ.16 వరకు ధర కట్టి కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల బ్లాక్ మార్కెట్ చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యం అందించే వ్యాపారస్తులకు, కొంతమంది డీలర్లకు నేరుగా కేజీకి రూ.20నుంచి రూ.22లు ధర ఇస్తున్నట్టు సమాచారం.

పట్టని అధికారులు

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు విని పిస్తున్నాయి. ఒకవేళ పట్టుకున్నా కొంతమంది రాజకీయ నాయకులు, ఉన్న తాధికారులు తమకు బంధువులంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి బియ్యం మాఫియాపై కఠిన చర్యలు తీసుకుని అడ్డుకోవాలంటూ పలువురు కోరుతున్నారు.



కందిపప్పు సొమ్ము రికవరీ ఎప్పుడు.. ?

- వినియోగదారులకు నిలిచిపోయిన పంచదార పంపిణీ
- దాదాపు రూ.12 లక్షలు బకాయి పడ్డ డీలర్లు

కుక్కునూరు, నవంబరు6(ఆంధ్రజ్యోతి):గోదావరి వరదల సమయంలో వరద బాధితులకు కందిపప్పు అమ్మి ఆ సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేయాలని రేషన్ డీలర్లను సంబంధిత అధికారులు ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండాలల్లోని రేషన్ డీలర్లకు కందిపప్పు సరఫరా జరిగింది. డీలర్లు ఆ కందిపప్పు అమ్మకం జరిపారు కానీ ఆ సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదు. ఆలస్యంగా మేల్కొన్న సంబంధిత అధికారులు కందిపప్పు సొమ్ము జమ చేయాలని ఆదేశించారు. కందిపప్పు సొమ్ము జమ చేస్తేనే పంచధార సరఫరా చేస్తామని చెప్పడంతో కొందరూ డీలర్లు సొమ్ము జమ చేయగా మరికొందరూ జమ చేయలేదు. దీంతో సుమారు 13 రేషన్ దుకాణాలకు పంచదార సరఫరా నిలిపివేయడంతో ఈనెల వినియోగదారులకు ఉచిత బియ్యం పంపిణీ మాత్రమే జరుగుతోంది. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో కుక్కునూరు మండలంలోని నాలుగు రేషన్ దుకాణాలు, వేలేరుపాడులో ఆరు దుకాణాలున్నాయి. ఇక ప్రైవేటు రేషన్ దుకాణాలు కుక్కునూరు మండలంలో 17, వేలేరుపాడులో 8 ఉన్నాయి. మొత్తం 35 దుకాణాలున్నాయి. కుక్కునూరు మండలానికి కందిపప్పు జూలై 2024లో 12,093 క్వింటాళ్లు, 2025లో 2,998 క్వింటాళ్లు సరఫరా జరిగింది. మొత్తం రూ.9లక్షల 96,006 విలువ కలిగిన 15,091 క్వింటాళ్ల కందిపప్పు సరఫరా చేశారు. వేలేరుపాడు మండలంలో జూలై 2024లో 7,479 క్వింటాళ్లు, జూలై 2025 7,436 క్వింటాళ్ల కందిపప్పు సరఫరా అయ్యింది. మొత్తం రూ.9,84,390 విలువ గల 14,915 క్వింటాళ్ల కందిపప్పు సరఫరా అయ్యింది. నిబంధనల ప్రకారం డీలర్లు డీడీ రూపంలో ముందుగా సొమ్ము చెల్లించిన తరువాతనే కందిపప్పు సరఫరా జరగాలి. కానీ వరదల సమయంలో అత్యవసరం కాబట్టి డీలర్లకు కొంత వెసులుబాటు ఇచ్చి కందిపప్పు ముందుగానే సరఫరా చేశారు. డీలర్లు కందిపప్పు అమ్మినా ఆ సొమ్మును జమ చేయడంలో కాలయాపన చేశారు. దీనిపై ఆలస్యంగా స్పందించిన అధికారులు కందిపప్పు సొమ్ము జమ చేయాలని ఆదేశించారు. ఇటీవల కొందరు డీలర్లు రూ.7లక్షల 99వేల195లు జమ చేశారు. ఇంకా దాదాపు రూ.11 లక్షల 81,199లు జమ చేయాల్సి ఉంది. అధికారులు సొమ్ము జమ చేయమని ఆదేశించినా కందిపప్పు అమ్మినందుకు మాకు రావాల్సిన కమీషన్‌లో జమ చేసుకోండి.. అంటూ కొందరూ డీలర్లు చెబుతున్నట్టు సమాచారం. కాగా జీసీసీ డీఎం దేవరాజు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'జీసీసీ పరిధిలో ఉన్న డీలర్లు సొమ్ము జమ చేశారు. ప్రైవేటు డీలర్ల నుంచి ఇంకా సొమ్ము జమ కావాల్సి ఉంది. దీనిపై సివిల్ సప్లై అధికారులతో మాట్లాడాం. డీలర్ల కమీషన్ పోనూ మిగిలిన సొమ్మును కట్టించేలా చూస్తున్నాం. ఈ నెలలో పూర్తిగా రికవరీ అయ్యే అవకాశం ఉంది' అన్నారు.

లెక్క తేలింది

- మొంథా తుఫాన్ పంట నష్టం తేల్చిన అధికారులు
- 5,704.24 హెక్టార్లలో వరి, ఇతర పంటలకు నష్టం
- ఇందులో 4,807.37 హెక్టార్లలో వరికి తీవ్ర నష్టం
- నేటికీ తేరుకోని వరి పొలాలు



ముదినేపల్లి మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో నీటమునిగిన వరి పైరు (ఫైల్)

ఏలూరుసిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్ర నష్టాలనే మిగిల్చింది. ఈ తుఫాన్ కారణంగా జిల్లాలో వరి, పత్తి, మినుములు, పెసలు, వేరుశనగ, అలసంద పంటలకు నష్టం వాటిల్లింది. వరి చేలు నేలకొరగడంతో చాలా ప్రాంతాల్లో వరి కంకులు మొలకలు రావడం , కుళ్లిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. మొంథా తుఫాన్ అపరాల పంటలకు తీవ్ర నష్టాన్నే మిగిల్చింది. తుఫాన్ తీరందాటిన తరువాత జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట నష్ట వివరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రకారం వ్యవసాయ శాఖ, గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా పంట నష్టాలను అంచనా వేశారు. ఈ ప్రతి గ్రామం తిరుగుతూ ఈ పంట నష్టాలను ఎన్యూమరేషన్ బృందం అంచనా వేసింది. గురువారం నాటికి వరితోపాటు వేరుశనగ, మినుములు, పెసలు, అలసంద పంటల నష్టాలు తేలాయి.

5,704.24 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో 5704.24 హెక్టార్లలో వరితో పాటు ఇతర పంటలు నష్టపోయినట్టు జిల్లా వ్యవసాయ శాఖ పంట నష్టాల సర్వే అనంతరం ప్రభుత్వానికి నివేదిక పంపింది. ప్రధానంగా వరి పంట 4807.37 హెక్టార్లలో నష్టపోగా మినుము 859.21 హెక్టార్లు, పత్తి 33.11 హెక్టార్లు, పెసలు 2.23 హెక్టార్లు, అలసంద 0.70 హెక్టార్లు, వేరుశనగ 1.62 హెక్టార్లు పంట నష్టపోయినట్టు ఆ నివేదికలో పేర్కొన్నారు. జిల్లా మొత్తం మీద 25 మండలాల్లో పంట నష్టాలు జరగగా ఇందులో 11,613 మంది రైతులు పంట నష్టపోయారు. ముదినేపల్లి మండలంలో ఎక్కువగా 831.96 హెక్టార్లలో, పోలవరం 725.80 హెక్టార్లు, దెందులూరు 634.40 హెక్టార్లు, ఉంగుటూరు 443.37 హెక్టార్లు, మండవల్లి 400.99 హెక్టార్లు, పెదపాడు 337.44 హెక్టార్లు, భీమడోలు 279.68 హెక్టార్లు, పెదవేగి 264.71 హెక్టార్లు, ఆగిరిపల్లి 260.57 హెక్టార్లు, కొయ్యలగూడెం 238.17 హెక్టార్లు, నూజివీడు 234.01 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం 229.18 హెక్టార్లు, నిడమర్రు 229.09 హెక్టార్లు, వేలేరుపాడు 95.69 హెక్టార్లు, చింతలపూడి 84.62 హెక్టార్లు, ద్వారకాతిరుమల 73.36 హెక్టార్లు, ముసునూరు 71.50 హెక్టార్లలో వరితోపాటు ఇతర పంటలు నష్టపోగా మిగిలిన మండలాల్లో 50 హెక్టార్ల కంటే తక్కువగానే పంటలు నష్టపోయాయి. పంట నష్టాల ప్రాతిపదికగా రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించే అవకాశాలున్నాయి. ఖరీఫ్‌లో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యం ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ.286 కోట్లు

- డీసీసీబీ పరిధిలో పేరుకుపోయిన మొండి బకాయిలు
- రికవరీలపై సమీక్షలు శూన్యం
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వర్తింపు ?



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాల సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మొండి బకాయిల ఏళ్ల తరబడి పేరుకుపోయి ఉన్నాయి. ఇందులో పెద్దఎత్తున ఎల్‌టీ రుణాలు తీసుకున్న బాపతే ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వాలు మారినా ఈ బకాయిల వసూళ్ల కొలిక్కి రాకపోవడం వెనుక పాలక వర్గాల పట్టింపులే కారణంగా తెలుస్తోంది. ప్రస్తుతం మొండి బకాయిల వసూలుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అమలు దిశగా ప్రభుత్వం యోచిస్తున్నా అది ఎంతవరకు అమలువుతుందో వేచి చూడాలి.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 258 సొసైటీలు ఉండగా రూ.286 కోట్ల మేర మొండిబకాయిలు వసూళ్లు కావడం లేదు. ఇందులో 258 సొసైటీల పరిధిలోనే రూ.190 కోట్ల మేర బకాయిలు పేరుకుపోగా వాటి పరిధిలోని 35 బ్రాంచ్‌ల్లో రూ.96 కోట్లు మొండి బకాయిలు పేరుకుపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది సొసైటీల పరిధిలో రూ.100 కోట్ల మేర ఇతర రూపాల్లో డీసీసీబీ నిధులు పక్కదారి పట్టాయి. దీంతో బకాయిలు విపరీతంగా పెరిగాయి. కొన్ని సొసైటీల్లో రూ.3 కోట్ల నుంచి రూ.10 కోట్ల మేరకు బకాయిలు పేరుకుపోయాయి. కిందిస్థాయిలో ఉద్యోగ సిబ్బంది కొరత వల్ల దీర్ఘకాలిక పంటలకు కోసం తీసుకున్న రుణాలు వసూలు కావడం లేదు. వైసీపీ హయాంలో పూర్తిగా వసూళ్లు పడకేశాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చాకా పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది.

ఓటీఎస్‌పై కసరత్తులు..

ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద వసూలు చేసేందుకు గల అవకాశాలను పరిశీలించడానికి తొమ్మిది మందితో ప్రభుత్వం ఇటీవల కమిటీని వేసింది. విశాఖ డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కోన తాతారావు ఆధ్వర్యంలో కమిటీని వేశారు. ఆప్కాబ్ ఎండీ, సీజీఎం ఆపరేషన్, డెవలప్‌మెంట్ తదితరులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలను సందర్శించి, ఆయా జిల్లాల్లో మొండి బకాయిలు వివరాలను సేకరించనుంది. సొసైటీల నుంచి తీసుకున్న రుణం మొత్తం ఒకేసారి చెల్లించాలా ఒక ప్రతిపాదన చేయనున్నట్లు సమాచారం. అసలు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తారా? లేక తీసుకున్న రుణం కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని అనే దానిపై కమిటీ చర్చించనుంది. అయితే ఈ కమిటీ కూడా ఇంకా సమావేశం కాలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఓటీఎస్ అమలు చేస్తే డీసీసీబీల మూలధనం విలువ గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. మొండి బకాయిలు వసూళ్లు జరుగుతాయా? ఓటీఎస్ అమలు చేస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సమీక్షలు తూచ్

మొండిబకాయిదారుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్టు కింద వసూళ్లు చేయాల్సి ఉన్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు. డీసీసీబీ ఛైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు బాధ్యతలు స్వీకరించి నాలుగున్నర నెలలు అవుతున్నా ఇప్పటికీ ఒక సమీక్ష జరగలేదు. ఇదిలా ఉండగా రికవరీలు, అకవతవకలపై కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు కనీసం ఆరు నెలలకొకసారైనా సమీక్షలు నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా ఇప్పటి వరకు ఒక సమీక్షా జరగలేదు. రికవరీలు, నిధుల స్వాహా చేసిన వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. ఇందులో కొందరు సొసైటీల ఉద్యోగులు ఉండడం కొసమెరుపు.

వరికోతల భారం!

- మొంథా తుఫాన్ ప్రభావంతో అదనపు వ్యయం
- వరి పొలాలు బురదమయం.. ట్రాక్ మిషన్లతోనే కోతలు
- ఎకరానికి రూ.10 వేలు పెరిగిన ఖర్చు

చాట్రాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గండం నుంచి బయట పడినా, ఎడతెరిపి లేని వర్షాలకు వరి పొలాలు ఊట పుట్టి బురదగా మారడంతో వరికోతలు ఆర్థిక భారంగా మారాయని అన్నదాతలు ఆవే దన చెందుతున్నారు. టైర్ల వరికోత మిషన్లు, ట్రాక్టర్లు పొలాల్లోకి దిగే పరిస్థితి లేదని వాపోతున్నారు. గతంలో వరి కోతలకు ముందు రైతులు వరిపొలాల్లో నీటిని తొలగించి తేమ లేకుండా చేసి టైర్ల మిషన్లతో వరికోతలు కోసేవారు. ట్రాక్టర్ ట్రక్కులు కోతకోసే దగ్గరకు వెళ్లి ధాన్యం లోడు చేసుకొనివచ్చేవి. దీనివల్ల రైతులకు ఎకరానికి 2,3 వేలు మాత్రమే ఖర్చు అయ్యేది. వరికోత కోసిన వెంటనే దున్నకుండా భూమికి పుల్లలతో రంధ్రాలు చేసి రబీ మొక్కజొన్న విత్తనాలు నాటేవారు. ఇప్పుడు తుఫాన్‌తో పరిస్థితి మారిపోయింది. టైర్ల వరికోత మిషన్లకు గంటకు రూ.2వేలు కాగా, ట్రాక్ మిషన్లకు రూ.3 వేలు పైనే ఉంది. టైర్ల వరికోత మిషన్లు గంటకు ఒక ఎకరం కోతకోస్తాయి. ట్రాక్ మిషన్లతో 3 నుండి 5 గంటలు పడుతోందని రైతులు చెబుతున్నారు. ట్రాక్ మిషన్ కోతకోసి ధాన్యాన్ని పొలంలో నుంచి సుదూరంలోని రోడ్డుకు తెచ్చి ట్రాక్టరు ట్రక్కుల్లో నింపాల్సి రావడంతో గంటలు పెరిగి రైతులకు అదనపు ఖర్చు అవుతోంది. దీనికి తోడు ట్రాక్ మిషన్లు తిరగడం వల్ల పొలం గాళ్ళు పడుతుండటంతో రబీ మొక్కజొన్న విత్తనాలు నాటడానికి అవకాశం లేకుండా ఉంది. ఎకరానికి ఐదు వేలు ఖర్చు పెట్టి పొలం దమ్ము చేయించి గొర్రుతోలి భూమి ఆరిన తర్వాత రబీ మొక్కజొన్న విత్తనాలు పెడుతున్నారు. ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వచ్చినా ఈ అదనపు ఖర్చు వల్ల రూపాయి మిగలదని రైతులు వాపోతున్నారు.



ట్రాక్ వరికోత మిషన్ రోడ్డు వద్దకు వచ్చి ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రక్కులో పోస్తున్న దృశ్యం



చాట్రాయిలో వరికోత కోస్తున్న ట్రాక్ మిషన్

జీఎస్టీ వసూళ్లపై ముమ్మర తనిఖీలు

ఏలూరు,నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలో ఆ శాఖ తరఫున నిత్యం జిల్లాలో ఏదో ప్రాంతంలో తనిఖీలను అధికారులను ముమ్మరం చేపడుతున్నారు. ఏలూరు శివారు మాదేపల్లిలోని వివిధ గూడ్స్ ఆటోల్లో తరలిస్తున్న వివిధ సరుకులకు సంబంధించిన వే బిల్లులను తాడేపల్లిగూడెం డీసీటీవో వరలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ చిరంజీవి గురువారం తనిఖీలు చేపట్టారు. వివిధ వస్తువుల జీఎస్టీ రేట్లలో మార్పులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో వివిధ డివిజన్లలో పొరుగు డివిజన్లలో అధికారులతో తనిఖీలను చేయిస్తున్నారు.

నరసాపురానికి వందే భారత్

కేంద్ర రైల్వే శాఖ ఉత్తర్వులు

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర సదస్సులో బీవీ రాఘవులు

లోపలి పేజీలో..

బదిలీల్లో పనితీరుకు ప్రాధాన్యం !

విద్యాశాఖలో ఉత్తమ ఫలితాల కోసం వినూత్న వ్యూహం

ఏలూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో బోధనాసిబ్బంది మొదలుకుని మండల, డివిజన్, జిల్లాస్థాయి విద్యాధికారుల వరకు ప్రధాన పనితీరు సూచిక(కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్-కేపీఐ) విధానాన్ని ప్రవేశ పెట్టడానికి నిర్ణయించారు. బుధవారం పాఠశాల విద్య ఉన్నతాధికారులు నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో పలు అంశాలపై నిర్ణయాలను ప్రకటించారు. మండలంలోని పాఠశాలల్లో టీచర్లు, విద్యార్థుల హాజరు నమోదులో మెరుగుదల, బడి బయట పిల్లల (డ్రాపవుట్స్)ను తిరిగి పాఠశాలలో చేర్పించడం, డ్రాప్‌బాక్స్ నిర్వహణ, పలు పరీక్షలు ముఖ్యంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత, తదితర ప్రామాణికాల్లో పనితీరుని కొలమానంగా తీసుకుని ఎంఈవోలకు సూచికల్లో మార్కులు/పాయింట్లువేసి వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంఈవోల పనితీరుని గమనించి వచ్చే ఏప్రిల్ తర్వాతే వారికి బదిలీలు ఉండవచ్చని భావిస్తున్నారు.

ఇవే రకమైన ప్రామాణికాలతో పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు, జిల్లాస్థాయిలో డీవైఈవోలకు కేపీఐలిస్తారని చెబుతున్నారు. టీచర్ల సాధారణ బదిలీలకు ఇప్పటికేవున్న నియమనిబంధనలకు కేపీఐ ఒక అదనపు ప్రాధాన్యతాంశంగా ఉంటుంది. ఉపాధ్యాయులు సకాలంలో హాజరు వేస్తున్నదీ, లేనిదీ పరిశీల నలోకి తీసుకోవడంతోపాటు, వారు బోధించే తరగతి, సబ్జెక్టులో విద్యార్థుల హాజరు, పరీక్షల్లో సాధించిన మార్కులను మాత్రం కేపీఐకి ఒక ప్రామా ణికంగా తీసుకుంటారు. ఈనెల 21 లేదా 22న కాంప్లెక్స్ మీటింగ్‌లను నిర్వహించడానికి ప్రాథమికంగా నిర్ణయించగా, తుది నిర్ణయాన్ని 13న ప్రకటిస్తామని వెల్లడించారు. అన్ని పాఠశాలల్లో పేరెంట్, టీచర్ సమావేశాలను ఈనెల లేదా డిసెంబరులో నిర్వహించనున్నట్టు ప్రకటించారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక స్టిక్కర్లను విడుదల చేస్తున్న డీఈవో, తదితరులు

నేడు స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

ఏలూరు అర్బన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, సేవాగుణం, జాతీయభావం, వ్యక్తిత్వ వికాసాభివృద్ధి వంటివి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల ప్రత్యేకతలని డీఈవో వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వ్యవస్థాపక దినోత్సవం నవంరు ఏడో తేదీని పురస్కరించుకుని ఫండ్ రైజింగ్ స్టిక్కర్ల విడుదల కార్యక్రమాన్ని గురువారం డీఈవో కార్యాలయంలో ఆమె ప్రారంభించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రతీ మండలానికి ఒకటి వంతున పీఎంశ్రీ హైస్కూళ్లలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఉన్నాయని, ప్రతి యూనిట్‌లో 30మంది వరకు స్కౌట్స్(బాలురు), గైడ్స్ (బాలికలు) శిక్షణ పొందుతున్నారన్నారు. పాఠశాల ప్రాంగణాలు, గ్రామాల్లోని ముఖ్యకూడళ్లలో మొక్కలు నాటడం, తదితర సేవాకార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు. దీనికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. శిక్షణానంతర పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గవర్నర్ ప్రశంసాపత్రాలు అందించడంతో పాటు ఉన్నత విద్యాకోర్సులు, మెడిసిన్, ఇంజనీరింగ్ ప్రవేశాల్లో పాయింట్ ఐదు శాతం రిజర్వేషన్లను ఆయా విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిందన్నారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అన్ని పీఎంశ్రీ హైస్కూళ్లలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి భాస్కర్‌కు సూచించారు. ఫౌండేషన్ డే స్టిక్కర్ ఒక్కొక్కటి పది రూపాయల చొప్పున విరాళంగా స్వీకరించి ఆ నిధిని ప్రభుత్వానికి జమ చేస్తామన్నారు. డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో అరుణ్‌కుమార్, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లను సత్కరించిన బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లకు సత్కారం

భీమవరంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు నూతనంగా డైరెక్టర్లుగా నియమితులైన చెరుకుపల్లి సంతోష్ (భీమవరం), సబ్బవీసు కృష్ణమోహన్(తాడేపల్లిగూడెం), ఆకెళ్ల వెంకటనారాయణ మూర్తి (అమలాపురం), కొలచిన పద్మావతి (నరసాపురం)లను సత్కరించారు. గురువారం భీమవరం గునుపూడి కార్యాలయంలో పురోహిత దూరవిద్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి, అధ్యక్షుడు పొదిల నారాయణమూర్తి మాట్లాడుతూ పురోహిత్యంపై ఆన్‌లైన్‌లో దూర విద్యావిధానం ద్వారా నేర్చుకోవచ్చన్నారు. అనంతరం సంస్కృత విశ్వవిద్యాలయం దూరవిద్య డైరెక్టర్ యల్లాప్రగడ కృష్ణమోహన, డిప్యూటీ రిజిస్ట్రార్ ఒరుగంటి కల్యాణ్ మాట్లాడారు. అమరావతి నారాయణ గురుకుల వేద పాఠశాల ప్రిన్సిపాల్ మంగిపూడి వెంకటశాస్త్రి ఘనాపాఠి, వారణాసి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, యామని రామచంద్ర సోమయాజ ఘనాపాఠి, సుదర్శనం దుర్గబాబు, వేలూరి హనుమకిరణ్, వేలూరి బుజ్జి, దర్భ అచ్యుతరామయ్య, చెరుకువాడ రంగసాయి, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో ఫంక్షన్ హాల్‌గా మారిన సినిమా హాలు

బొమ్మ పడట్లేదు !

ప్రశ్నార్థకంగా సినీ థియేటర్ల మనుగడ

మసకబారుతున్న వెండితెర వెలుగులు ▸▸ ఆదరణలేక మూసివేత.. ఫంక్షన్‌హాళ్లుగా మార్పు

ఒకప్పుడు సినిమా విడుదల అవుతుందంటే పల్లె, పట్నం తేడా లేదు.. ఓ పండుగ వాతావరణం ఉండేది. టికెట్టు దొరికితే చాలు ఆ లెక్కే వేరుగా ఉండేది.. సినిమా విడుదలకు ముందురోజు అర్ధరాత్రి నుంచే అభిమానులు థియేటర్ల వద్ద బారులు తీరేవారు.. ఏడాదికాలం ఒకే సినిమాను నడిపిన థియేటర్లూ ఉండేవి. ప్రస్తుతం రోజులు మారాయి. వినోదరంగం కొత్త పుంతలు తొక్కుతోంది. ఓటీటీల రాకతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పల్లెల్లో సైతం ఎన్నోఏళ్లు కళకళలాడిన సినిమాహాళ్లు ప్రస్తుతం తమ ప్రాభవాన్ని కోల్పోయాయి.. పలుచోట్ల మూతపడి వ్యాపార కేంద్రాలుగాను, ఫంక్షన్ హాళ్లుగా మారాయి. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ద్వారకాతిరుమల

చిత్రపరిశ్రమ మనుగడకు సినిమా థియేటర్ల ప్రాధాన్యం అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు సదరు పరిశ్రమ మనుగడకు రకరకాల ఆదాయమార్గాలు అందుబాటులోకి రావడంతో థియేటర్ వ్యవస్థ క్రమంగా కుప్పకూలిపోతోంది. మూడు గంటలపాటు అన్ని బాధలను మరిపింప చేసే శక్తి సినిమాకు ఉంది. మనపై ఎంతో ప్రభావాన్ని చూపే సినిమాను అందించే థియేటర్‌తో ప్రేక్షకులకు ఎంతో ఎమోషనల్ బాండ్ ఉంది. ఇటీవల సినీ అభిమానులు థియేటర్లకు మధ్య దూరం పెరుగుతోంది. వీటికి ప్రధానంగా సరైన సినిమాలు తీయకపోవడం, టికెట్ ధరల పెంపు, ముఖ్యంగా ఓటీటీ, పైరసీల పెరుగుదల, అభిరుచి మారడం వంటి కారణాలతో ప్రేక్షకులు సినిమా హాళ్లకు వచ్చేందుకు విముఖత చూపుతున్నారు. ఈమేరకు కొన్నిచోట్ల థియేటర్లు సందడి లేకుండా మూగబోతుంటే మరికొన్ని చోట్ల అవి మూతబడుతున్నాయి. ఈక్రమంలో పల్లెల్లో సైతం ఎన్నాళ్లగానో ప్రేక్షకులను అలరించిన సినిమాహాళ్లు ప్రస్తుతం మూతపడి ఇతర ఆదాయవనరుగా మారాయి. దీనిలో భాగంగా ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లోని సినిమా థియేటర్లు ఒకటి వ్యాపార కేంద్రంగాను మరొకటి ఫంక్షన్ హాల్‌గా మారింది. ద్వారకాతిరుమలలో ఉన్న సినిమాహాల్ పూర్తిగా మాయమైంది. అది ఎక్కడ ఉండేదో ఇప్పుడు వారికి అసలు తెలియదు.

30 శాతం థియేటర్ల మూత..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో గతంలో 139వరకు థియేటర్లు ఉండగా పలు కారణాలతో 43 థియేటర్లు మూతపడ్డాయి. 96 థియేటర్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఒక్క ఏలూరులోనే గతంలో ఉండే కల్పన థియేటర్, కేసరి, వెంకట్రామ, రమామహల్, పాండురంగ. వేదరాజ్ వంటి థియేటర్లు కనుమరుగయ్యాయి. వాటి స్థానాల్లో వ్యాపారకేంద్రాలు, అపార్ట్‌మెంట్లుగా వెలిశాయి.



ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురంలో వ్యాపారకేంద్రంగా థియేటర్

ఒకప్పటి సినీ థియేటర్ల కబుర్లు..

● ఆనాటి కాలంలో టికెట్ల ధర నేల రూ.0.25 పైసలు, బెంచి రూ.0.40 పైసలు, కుర్చీ రూ.0.75పైసలు. థియేటర్ల ప్రత్యేకత ఏమిటంటే టికెట్లు ఇస్తూనే ఉండేవారట.. నేల ఫుల్‌గా నిండి ఒకరి భుజాలమీద ఇంకొకరు కూర్చున్నప్పటికీ టికెట్లు ఇస్తూనే ఉండేవారు. బెంచి క్లాస్‌లో అదనంగా బెంచీలు, బాల్కనీలో ఇనుప కుర్చీలు వేసేవారు.. నేలకి ఏ సౌకర్యం లేదు.. ఒకరిమీద ఇంకొకరు.. ఎవరు ఎలా కూర్చున్నా ఎవరికి పట్టదు.. ఆడవాళ్ల నేల క్లాసులో జుట్టు జుట్టు పట్టుకుని కొట్టుకోవడమే.. ఈ ఉత్పాతంలో బొమ్మపడేది... ఊపిరాడని ఈ స్థితిలో కూడా బీడీలు, సిగరెట్లు గుప్పుగుప్పుమని రగిలిపోయేవి. కథ మంచి రసపట్టులో ఉండగా నిమ్మసోడా.. అని ఒకడు వేయించిన శనక్కాయలూ అంటూ మరొకడు.. నేల క్లాసులో కూర్చున్న వారి కాళ్లు తొక్కుకుంటూ అమ్మకాలు సాగించేవారు.

● ఇక బెంచి క్లాస్‌లో వేలాది నల్లులు ఎప్పుడో థియేటర్ కట్టినప్పుడు అవి ఎక్కడి నుంచో వలస వచ్చిఉంటాయ్.. ప్రేక్షకులు ఎప్పుడొస్తారా అని ఎదురు చూస్తూ వారు వచ్చిన వెంటనే కుటుంబసమేతంగా దాడి చేస్తుండేవి.

రాయితీలు ఇవ్వకుంటే మనుగడ కష్టమే..



గతంలో ప్రేక్షకులకు ఒక్క సినిమానే ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చేది. టీవీలు రావడం... ఆ తరువాత పైరసీలు, ఓటీటీల ప్రభంజనంతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. దాదాపు 52 ఏళ్ల క్రితమే ఉషాపిక్చర్స్ బ్యానర్‌తో జిల్లాలో మొదటగా కార్యాలయాన్ని ప్రారంభించా. ఇప్పటివరకు 2,249 సినిమాలు విడుదల చేశాం. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నా పేరు ఎక్కింది... ఈ పరిశ్రమ మనుగడకు ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం.. ఇతర పరిశ్రమలకు ఇచ్చే అన్ని రాయితీలను వర్తింపచేయాలి. కరెంటు రాయితీలు, సబ్సిడీపై రుణాలను థియేటర్ల యజమానులకు ఇవ్వాలి... పది శాతం దిగువకు జీఎస్టీ, పైరసీలను అరికట్టడంతో పాటు వందరోజుల తర్వాతే సినిమాలను ఓటీటీలలో విడుదల చేయాలి. ప్రభుత్వం ప్రోత్సహించకుంటే రానున్న రోజుల్లో థియేటర్లన్నీ మూతపడే అవకాశం ఉంది.

- డాక్టర్ వడ్లపట్ల వెంకట బాలకృష్ణారావు
ఉషా పిక్చర్స్ అధినేత, ఏలూరు.

● ఇక కుర్చీలు బాల్కనీలో ఉంటాయి. చినిగిపోయి దూది, కొబ్బరి పీచు బయటికి వచ్చి మనల్ని వెక్కిరిస్తుంటాయి... ఇక్కడ పెద్దగా నల్లులుండవు కానీ మేకులు దిగిపోతుంటాయి.. ఇక అన్ని క్లాసులలోనూ ఉన్న ఫ్యాన్లు.. వాటి కింద సీటు సంపాదించడం కష్టం... సంపాదించినా అవి సవ్యంగా తిరిగే ఫ్యాన్లు అయి ఉండడం కష్టమే... అక్కడితో మనకష్టాలు ఆగవు. కరెంటు వాళ్ల దయ లేకుంటే పవర్‌కట్. ప్రేక్షకులు ఇక పిచ్చెక్కినట్లు అరవడం... ఈలలు వేసి గోల చేస్తారు.. ఇప్పుడు అనేక సౌకర్యాల మధ్య సినిమా చూస్తున్నా అప్పటి ఆ ఉత్సాహం ఉల్లాసం... ఇక రాదనే చెప్పాలి.



హుండీల సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

రాట్నాలమ్మ హుండీల ఆదాయం రూ.14.56 లక్షలు

పెదవేగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 86 రోజులకు సంబంధించి మొత్తం ఆదాయం రూ.14,56,054 వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయబాబునాయుడు పర్యవేక్షణలో ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, పాలకవర్గంసభ్యుల ఆధ్వర్యంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించామన్నారు.

శివదేవునికి వెండి పళ్లెం, శఠారి అందజేత



వెండి పళ్లెం, శఠారిని ఈవో మూర్తికి అందజేస్తున్న దాత

ద్వారకా తిరుమల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయానికి ఓ దాత వెండి పళ్లెం, శఠారి (పాదుకలు)ను విరాళంగా అందజేశారు. ద్వారకాతిరుమలకు చెందిన పావులూరి వెంకట సత్యకామేశ్వరరావు దాదాపు 780గ్రాముల బరువైన వస్తువులను ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తికి అందించారు. వీటి విలువ సుమారు రూ. 1.30లక్షలు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. శివయ్యసేవలకు దీన్ని వినియోగించాలి దాత కోరారు.



గండిపడిన పెదవాగు ప్రాజెక్టు (ఫైల్)

ప్రాజెక్టు తెలంగాణలో.. ఆయకట్టు ఆంధ్రాలో..

అంతర్ రాష్ట్ర సమస్యతో కునారిల్లుతున్న పెదవాగు ప్రాజెక్టు

ప్రాజెక్టు తెగిపోయి ఏడాది అవుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు

వేలేరుపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇరురాష్ట్రాల నిర్లక్ష్యం కారణంగా పెదవాగు ప్రాజెక్టుకు గండిపడి రైతులకు సాగునీరందక పంటలు ఎండబెట్టుకునే పరిస్థితి దాపరించింది. తెలంగాణలోని అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి గ్రామం వద్ద 1978లో నిర్మించిన ఈ ప్రాజెక్టు 5 టీఎంసీలు నిల్వ ఉండేలా 18వేల ఎకరాలకు సాగునీరందేలా కాల్వల నిర్మాణం చేపట్టారు. ఇందులో ఆంధ్రాలోనే వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు కుడి, ఎడమల కాల్వల ద్వారా 13,640 ఎకరాలు, తెలంగాణలోని గుమ్మడిపల్లి ప్రాంతంలో 2,360 ఎకరాలకు తాగునీరందించేలా కాల్వలు, ఉపకాల్వలు నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయేంత వరకు పూర్తిస్థాయిలో కాకున్న ఈ రెండు రాష్ట్రాల్లోని పది వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులు పంటలు పండించుకున్నారు. ఈ ప్రాజెక్టు కింద సాగుచేసుకునే రైతుల్లో 80 శాతం గిరిజన రైతులే ఉన్నారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలుగా విడిపోవడంతో పెదవాగు ప్రాజెక్టుకు కష్టాలు మొదలయ్యాయి. ఆయకట్టులో అధిక భాగం ఆంధ్రాలో ఉన్న కారణంగా ప్రాజెక్టు నిర్వహణకు ఆంధ్రా 85శాతం, తెలంగాణ 15శాతం నిర్వహణ వ్యయాన్ని భరించేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం మేరకు ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్వహణకు నిధులు విడదల చేయకపోవడంతో ఆంధ్రా పరిధిలో నిర్మించిన కాల్వలు ఎక్కడికక్కడ గండ్లు పడిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉపకాల్వలు అనవాళ్లు లేకుండా పోయాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం తమ భూభాగంలో ఉన్న ఆయకట్టు పరిధిలోని కాల్వలకు మరమ్మతులు చేసి సాగునీటిని విడుదల చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతానికి ఈ కాల్వల ద్వారా నీటిసరఫరా జరగడంలేదు. రైతులు కేవలం వర్షాధారంగానే పంటలు పండించుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది.

పట్టించుకోని అప్పటి వైసీపీ ప్రభుత్వం

ఈ దశలో 2019-24 మధ్యలో ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. ప్రాజెక్టు ఆధునికీకరణకు, బోర్డు నిర్వహణకు రూ.8కోట్లు విడుదల చేసేందుకు అప్పట్లో ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. కానీ అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేసింది. ఒప్పందం మేరకు విడుదల చేయాల్సిన రూ.8 కోట్లలో ఒక్క రూపాయి విడుదల చేయకపోవడంతో ప్రాజెక్టు ప్రమాదంలో పడింది. ప్రాజెక్టు నిర్వహణను పట్టించుకోకుండా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన సాగించిన కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం

ప్రాజెక్టు కట్ట తెగిన తరువాత తెలంగాణ ప్రభుత్వం పెదవాగు ప్రాజెక్టును ఆధునీకరించేందుకు 100 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసింది దీనిలో 85 ఆంధ్రా ప్రభుత్వం, 15 శాతం తెలంగాణ ప్రభుత్వం భరించేలా ప్రతిపాదనలు చేశారు. అయితే ఆంధ్రా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.3 కోట్లు విడుదల చేసి కట్టతెగిపోయిన ప్రాంతంలో రింగుబండ్ నిర్మించుకుంది.

తెగిన కట్ట.. భారీగా ఆస్తుల నష్టం

ఇరు రాష్ట్రాల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు నిర్వహణను పట్టించుకోకపోవడంతో 2024 సెప్టెంబరు 18న ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురిసిన భారీవర్షాల కారణంగా ప్రాజెక్టుకు పరిమితికి మించి వరద నీరు చేరుకోవడంతో అధికారులు ప్రాజెక్టుకు ఉన్న మూడుగేట్లను ఎత్తే ప్రయత్నంలో రెండుగేట్లు మాత్రమే పైకి లేవడంతో మరోగేటు లేవకపోవడంతో వరద క్షణక్షణానికి అధికమై ప్రాజెక్టు కట్ట పైనుంచి వరద పొంగి పొర్లింది. దీని కారణంగా ప్రాజెక్టు ఎడమవైపు గేట్లు పక్కనే భారీగా గండిపడడంతో వరద దిగువన ఉన్న వేలేరుపాడు మండలంలోని గ్రామాలపై విరుచుకుపడడంతో ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాయి. భారీగా ఆస్తి, పశునష్టం జరగడమే కాకుండా వేలాది ఎకరాల్లో నాలుగు నుంచి ఐదు అడుగుల మేర ఇసుక మేటలు వేశాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్పట్లో పర్యటించిన రాష్ట్ర మంత్రులు, జిల్లా కలెక్టర్ జరిగిన విధ్వంసాన్ని చూసి బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పొలాల్లో పేరుకుపోయిన ఇసుక మేటలను తొలగించి పొలాలను పూర్వపు స్థితికి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. భారీ వరద కారణంగా ఇళ్లకొట్టుకుపోయిన వారికి పక్కాఇళ్లు నిర్మించి ఇస్తామని వాగ్దానం చేశారు. ఏడాదిదాటిన ఏ ఒక్క వాగ్దానం అమలు కాకపోవడంతో పెదవాగు బాధితుల్లో అసంతృప్తి నెలకొంది.

ఆంధ్రా రైతులకు శాపంగా మారింది



పెదవాగు ప్రాజెక్టు నిర్వహణ విషయంలో ఇరు రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాజెక్టు రెండు రాష్ట్రాల పరిధిలో ఉండడం ఆంధ్రా రైతులకు శాపంలా మారింది. నిధుల విడుదల విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ప్రాజెక్టును గోదావరి రివర్‌బోర్డు పరిధిలోకి తెచ్చినప్పటికి ఉపయోగం లేకుండా పోయింది. ప్రాజెక్టుకు నిధులు కేటాయించి రైతులకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలి.

- కారం దొరయ్య
ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

12 గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం



ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నిర్లక్ష్యం కారణంగా పెదవాగు ప్రాజెక్టు దిగువన ఉన్న 12గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. 2024లో ప్రాజెక్టు కట్ట తెగిన సందర్భంలో భారీ ఆస్తి, పంట నష్టం జరిగింది. సాగు భూముల్లో ఇసుకమేటలు పేరుకుపోయాయి. ప్రాజెక్టుకట్ట తెగిపోవడంతో ఒక్కసారిగా వరద ఊళ్లపై పడి విధ్వంసం సృష్టించింది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కట్టుబట్టలతో పరుగులు తీశారు. ఆదుకుంటామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం నేటికి న్యాయం చేయలేదు.

- షేక్ గౌస్
అఖిల భారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం (ఇన్‌సెట్‌లో) స్వామివారు..



ద్వారకాతిరుమలలో సుబ్రహ్మణ్యేశ్వరునికి లక్షబిల్వార్చన.. సహస్రదీపోత్సవ వేడుకలో భాగంగా దారి పొడవున కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాలకొల్లు క్షీరారామంలో జ్వాలాతోరణం

పాలకల్లు అర్బన్, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్రం పురస్క రించుకుని గురువారం రాత్రి ఆలయ గోపురం ముందు జ్వాలా తోరణం వెలిగించి, జ్వాలా తోరణం కింద నుంచి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులతో మూడు మార్లు తిప్పారు. కార్తీక మాసం సందర్భంగా క్షీరా రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదానంలో ఐదు వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. స్వామివారికి పాలక మండలి చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు, అధికారులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణప్ప, పూర్ణయ్య, అనీల్ కుమార్‌శర్మ, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, చైర్మన్ మీసాల రాము, ట్రస్టీలు పినిశెట్టి శ్రీనివాస్, బాసిన సత్యనారాయణ, హోతా ప్రవాళ, కొండ్రెడ్డి సూరిబాబు, సింహాచలం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో సహస్ర దీపోత్సవం

ద్వారకాతిరుమల : శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన చెరువు వీధిలోని శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామికి విశేష కార్యక్రమాలు జరిగాయి. దీనిలో భాగంగా గర్భాలయంలో కొలువైన స్వామికి అభిషేకాలు, అనంతరం లక్షబిల్వార్చన నిర్వహించారు. రాత్రి జరిగిన సహస్ర దీపోత్సవ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. కార్తీక పౌర్ణమి మరుసటి రోజున ఈ వేడుకను నిర్వహించడం సంప్రదాయం. ఈమేరకు ఆలయాన్ని, పరిసరాలను సిబ్బంది శోభాయమానంగా అలంకరించారు. రాత్రి ఆలయం ముందున్న రహదారి పొడవునా అరటి బోదెలను ఉంచి వాటిపై మహిళలు దీపాలను వెలిగించి భక్తిని చాటారు.



మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే పితాని భార్య అనంతలక్ష్మి, కుటుంబ

ఆచంటేశ్వరుడి సన్నిధిలో కర్పూర జ్యోతి

ఆచంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వరుని సన్నిధిలో కర్పూరజ్యోతి కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు వెలిగించిన కర్పూరజ్యోతిలో ఆవునెయ్యి వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ భార్య అనంతలక్ష్మి, కుటుంబ సభ్యులు స్వామివారి సన్నిధిలో ఉన్న కర్పూర జ్యోతిలో ఆవునెయ్యి వేసి మొక్కులు తీర్చుకున్నారు.

లక్ష్మీగణపతి సన్నిధిలో కార్తీక దీపోత్సవం

ఏలూరుకార్పొరేషన్ : ఏలూరు-సత్రంపాడులోని లక్ష్మీగణపతి స్వామి ఆలయంలో కార్తీకమాసం నేపథ్యంలో గురువారం రాత్రి భక్తులు సామూహికంగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. శివలింగం ఆకృతిలో కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు.

విరబూసిన బ్రహ్మకమలం పుష్పాలు

ద్వారకాతిరుమల : శివకేశవులకు ఎంతో ఇష్టమైన బ్రహ్మకమలం పూలు మండలంలోని దేవినేనివారి గూడెంలో విరబూశాయి. గ్రామానికి చెందిన పాకలపాటి సుబ్రహ్మణ్యం ఇంటి పెరట్లో 20 పూలు వికసించడం పలువురిని అబ్బురపరచింది. ఇప్పటికే జూన్‌లో 15, జూలైలో 13, సెప్టెంబరులో 18 పూలు తాజాగా ఒకేసారి మొక్క చుట్టూ 20 పూలు వికశించ డంతో గ్రామస్థులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ఓస్లో సైన్స్‌పార్కును సందర్శించిన ఎంపీ మహేశ్



ఏలూరుటూటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా నార్వేలో పర్యటిస్తున్న ఎంపీ మహేశ్‌కుమార్ ఓస్లోసైన్స్ పార్కును గురువారం సందర్శించారు. చిన్నపిల్లలకు చెందిన నార్వేజియన్ డేకేర్ సెంటర్‌కు వెళ్లి అక్కడ అమలు చేస్తున్న పిల్లల హక్కులు, డేకేర్ వ్యవస్థ నడుస్తున్న తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓస్లో నగర మేయర్ అన్నేలిండ్‌బోతో సమావేశమై నగర పరిపాలన, పన్నుల విధానంలో అనుసరిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, మీడియా సైన్స్, ఎనర్జీ, నానోటెక్నాలజీ, హెల్త్ వంటి రంగాలకు చెందిన 300కుపైగా కంపెనీలున్న ఓస్లో సైన్స్‌పార్కును ఎంపీల బృందం సందర్శించింది. ఆవిష్కరణలకు తోడ్పడటం, వృద్ధి చెందుతున్న కంపెనీలకు చెందిన మరిన్ని ప్రోత్సహిస్తున్న విధానాలు అధికారులు భారత బృందానికి వివరించారు.

సింగపూర్‌లో విద్య అధ్యయనానికి టీచర్ గంగాధర్



బుట్టాయగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుర్రం గంగాధర్‌ను సింగపూర్ అధునాతన విద్యావిధానాన్ని అధ్యయనానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు వారం రోజులపాటు సింగపూర్‌లో ప్రముఖ పాఠశాలలను సందర్శించి అక్కడ అధునా తన సాంకేతిక విధానాలను, బోధన పద్ధతులను, తరగతి గదుల్లోని వాతావ రణం, మౌలిక ప్రమాణాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుదలకు నివేదికను అందజేస్తారు. ఈసందర్భంగా ఆయనను డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎంఈవోలు, హెచ్‌ఎం తోటి ఉపాధ్యాయులు అభినందించారు.



టి.నరసాపురం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేయాలి

టి.నరసాపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేయాలని, భూమిలేని పేదలకు భూపంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం 32వ మహాసభలను సంఘ రాష్ట్ర కార్యదర్శి రెండో రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహాసభల ప్రారంభ సూచిక వ్యవసాయ కార్మిక సంఘం జెండాను సంఘ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రరావు ఆవిష్కరించారు. ఈ సభకు మహాసభ అధ్యక్షవర్గంగా ఎం.జీవరత్నం, ముత్యాలమ్మ, నాగవేంద్రరావు, రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో భూమి, ఉపాధిహామీ, ఇళ్ల స్థలాలు, పామాయిల్ కార్మికుల సమస్యలపై నిరంతరపోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాలకు అనవాయితీగా దళితులు, పేదలకు సంక్షేమ పథకాల సాకుచూపి సాగు చేసుకుంటున్న భూములను సైతం భూస్వాములకు కట్టబెట్టే ప్రయత్నానికి పూనుకుంటున్నాయని మండిపడ్డారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అబ్కారీ ఇన్‌చార్జి అధికారి ప్రసాద్‌రెడ్డి

భీమవరంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) :జిల్లా మద్య నిషేధ అబ్కారీ ఇన్‌చార్జి అధికారి ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణిని గురువా రం కలెక్టరేట్‌లో మర్యాదపూ ర్వకంగా కలిసి పూల మొక్కను అందజే శారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదా ర్థాల అమ్మకం, వినియోగం ఉండరాదని, క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉండాలని ఆదేశించారు. జిల్లాకు మద్య నిషేధ అబ్కారీ ఇన్‌చార్జి అధికారిగా నియమిస్తూ ఆ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జి జిల్లా మద్య నిషేధ అబ్కారీ అధికారిగా వ్యవహరించిన ఏలూరు అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ ప్రభు కుమార్ నుంచి ప్రసాద్ రెడ్డి చార్జి తీసుకున్నారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రసాద్ రెడ్డి

అండర్-19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు పాలకొల్లు విద్యార్థి సమీరుద్దీన్



పాలకొల్లు టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థి షేక్ సమీరుద్దీన్ అండర్-19 రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. పట్టణంలోని బ్రాడీపేటకు చెందిన సమీరుద్దీన్ స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన అంతర్ జిల్లాస్థాయి పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు తరఫున పాల్గొన్నాడు. వచ్చే నెల 5వ తేదీ నుంచి హరియాణాలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడని కళాశాల పీడీలు రామకృష్ణ, జయరాజ్, బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు పెదతాడేపల్లి విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ జిల్లా ఎంపికలో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని హెచ్‌ఎం లాల్‌బీబీ గురువారం తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో డిస్కస్‌త్రోలో బొల్లం శైలజ, అండర్-14 బాలికల విభాగంలో పల్లంట్ల మేరీ, బాలుర విభాగంలో కొమ్మర రిషి ప్రతిభ కనబరిచినట్టు వివరించారు. నవంబరు 8, 9 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ఎ.నాగార్జునలను సర్పంచ్ పోతుల అన్నవరం, సొసైటీ అధ్యక్షుడు పరిమి వెంకటకృష్ణ, హెచ్‌ఎం లాల్‌బీబీ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ మూర్తి, పీఈటీ సీతామహాలక్ష్మి

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యాభవన్స్ విద్యార్థులు

పాలకొల్లుఅర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):స్థానిక భారతీయ విద్యా భవన్స్‌కు చెందన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి గురువారం తెలిపారు. పూళ్ల జడ్పీ హైస్కూల్లో ఈనెల 4న జరిగిన ఎంపికల్లో తమ విద్యార్థులు ఎంపికయ్యారని, ఈనెలలోనే రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14 బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థినిలు డి.శృతిక, జి. షణ్ముఖప్రియ, అండర్-17 బాలుర విభాగంలో కె.నిఖిల్ కుమార్(8వ), కె.చేతన్‌హర్ష (9వ) ఎంపిక అయ్యారన్నారు. విద్యార్థులను, పీఈటీ సీతామహాలక్ష్మిని డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ కేవీ శివ ప్రసాద్ అభినందించారు.

జీరో సబ్జెక్టు టీచర్ల సమస్య..

పని సర్దుబాటుతో చెక్

ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ మిగులు ఉపాధ్యాయులతో వర్క్ అడ్జస్ట్‌మెంట్



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టులు బోధించే టీచర్ల కొరతను నివారించేందుకు విద్యాశాఖ ఎట్టకేలకు ఉపక్రమించింది. విద్యా సంవత్సరం ప్రారంభమై 3 నెలలు పైనే గడిచినా, మెగా డీఎస్సీ నియామకాలు పూర్తయినా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో వివిధ హైస్కూళ్లు జీరో సబ్జెక్టు టీచరు సమస్యతో నడుస్తున్నాయి.

(ఏలూరు అర్బన్-ఆంధ్రజ్యోతి)

పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచరు ఒక్కరు కూడా లేకుండా నడుస్తుండగా, మరి కొన్నిచోట్ల ఇద్దరు టీచర్లు ఉండాల్సిన హై స్కూళ్లలో ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. కీలక మైన గణితం, ఇంగ్లీషు, సైన్స్, తదితర సబ్జెక్టులను బోధించేందుకు టీచర్లు లేక బోధన కుంటు పడటంతోపాటు, ముఖ్యమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలపై ప్రభావం చూప నుంది. మరోవైపు సబ్జెక్టు టీచర్లు లేకుండానే ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ (త్రైమాసిక) పరీక్షలు జరుగుతుం డటాన్ని పలువురు ప్రధానోపాధ్యాయులు వేలెత్తి చూపు తున్నారు. ఈ నేపథ్యంలో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించేందుకు అవసరమైన పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) విధి విధానాలపై ప్రభుత్వం నుంచి ఇంతవరకు అధికారిక ఉత్తర్వుల కోసం వేచి చూడటం కంటే జిల్లా స్థాయిలోనే మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేయాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది.

కొత్త జిల్లాల ప్రాతిపదికనే మున్సిపల్ సర్‌ప్లస్ టీచర్లతో పని సర్దుబాటు!

సాధారణంగా టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌కు ఏటా ప్రభుత్వం ఉత్తర్వులిస్తుంది. ఒక కటాఫ్ తేదీని ప్రామాణికంగా తీసుకుని ఆ రోజున స్కూలు/తరగతిలోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా, నిర్ణీత నిష్పత్తిన ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ణయించి అదనంగా ఉన్న ఉపాధ్యాయులను (సర్‌ప్లస్) కొరత ఉన్న పాఠశాలలకు పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై ఆ విద్యా సంవత్సరం ముగిసేవరకు నియమించేవారు. ఈ ఏడాది నవంబరు వచ్చినప్పటికీ వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి ఎటువంటి సంకేతాలు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల సబ్జెక్టుల బోధనకు ఉపాధ్యాయుల కొరత కొనసాగుతోంది. దీనికి ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ కూడా పరిష్కారం చూపలేకపోయింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కేటగిరీ-1, 2లలోని పాఠశాలల్లో ఉన్న వెకెన్సీలను మినహాయించి, మిగతా కేటగిరీల్లోని ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం తాజా సమస్యకు కారణమైంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించడానికి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టడానికి జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం కొత్త జిల్లాల ప్రాతిపదికన గుర్తించిన సర్‌ప్లస్ టీచర్లను ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేవరకు కొరతవున్న హైస్కూళ్లకు సర్దుబాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో సర్‌ప్లస్ టీచర్లు మున్సిపల్ పాఠశాలల్లోనే ఉన్నట్టు గుర్తించారు. ఆ మేరకు ఏలూరు డివిజన్‌కు సంబంధించి పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో జీరో సబ్జెక్టు టీచర్లున్న పాఠశాలలుగా గుర్తించిన 10 హైస్కూళ్లలో సోమవారం నాటికి వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నగరపాలక సంస్థ యాజమాన్య పాఠశాలల్లో మిగులుగా వున్న ఉపాధ్యాయులను నియమించనున్నారు. ప్రస్తుతం ఏలూరు కార్పొరేషన్ పాఠశాలల్లో సర్‌ప్లస్‌గా ఉన్న 116 మంది ఎస్జీటీలు, 19 మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్ల నుంచి ఆయా సబ్జెక్టుల్లో అర్హతలున్న 10 మందిని వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై నియమించాలని నిర్ణయించారు. ఇక ఉమ్మడి జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూ డెం, కొవ్వూరు, తణుకు, నరసాపురం, నిడదవో లు, పాలకొల్లు పురపాలక సంఘాల్లో 30 మంది సర్‌ప్లస్ టీచర్లున్నట్టు గుర్తించారు. వీరిని సంబంధిత డివిజన్లలోని పాఠశాలల్లో జీరో సబ్జెక్టు టీచరు సమస్య ఉన్నచోట నియమిస్తారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా నియమించేందుకు కసరత్తు ఏలూరు జిల్లాలో ఇప్పటికే పూర్తికాగా, భీమవరం కేంద్రంగా ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో జీరో సబ్జెక్టు టీచర్ల పాఠశాలలు, సర్దుబాటు ఏర్పాట్లపై స్పష్టత లేదు.

నరసాపురానికి వందే భారత్

కేంద్ర రైల్వే శాఖ ఉత్తర్వులు

ఫలించిన కేంద్ర మంత్రి వర్మ కృషి



భీమవరంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పార్లమెంటు నియోజకవర్గానికి తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు చెన్నై (ఎంజీఆర్ చెన్నై సెంట్రల్) నుంచి విజయవాడ వరకు నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్లు 20677/20678)ను నరసాపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వేకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వందే భారత్‌ను నరసాపురం ప్రాంతానికి తీసుకు రావడం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే ఉన్నతాధికారులతో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ పలుమార్లు సమావేశమై నరసాపురం ప్రాంతా నికి వందే భారత్ ఆవశ్యకతను బలంగా తెలిపారు. ఈ రైలు పొడగింపుతో పశ్చిమగోదావరి జిల్లా వాసులతోపాటు కోనసీమ వాసులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. నరసాపురం వరకు పొడిగించిన ఈ మార్గంలో గుడివాడ, భీమవరం టౌన్ స్టేషన్లలో వందే భారత్ ఆగుతుంది. చెన్నైలో ఉదయం 5-30కు బయలుదేరే రైలు నెం. 20677 రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్లో ఆగుతూ విజయవాడలో 11-45 గంటలకు చేరుతుంది. మధ్యాహ్నం 12-34కు గుడివాడ, 1-29కు భీమవరం టౌన్ చేరుకుని మధ్యాహ్నం 2-10కు నరసాపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నరసాపురం నుంచి నెం. 20678 రైలు మధ్యాహ్నం 2-50కు బయలుదేరి 3-19 గంటలకు భీమవరం టౌన్, 4-09కి గుడివాడ చేరుకుని, 4-50కు విజయవాడకు చేరుకుని చెన్నైకు రాత్రి11-45కు చేరుతుంది. అధికారిక ప్రారంభ తేదీ త్వరలో తెలియజేయనుంది.

మూడు చక్రాల వాహనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల మోటార్ వాహనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్టు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఆ దరఖాస్తు, అన్ని ధ్రువపత్రాల నకళ్లతో తమ కార్యాలయానికి ఈ నెల 25వ తేదీలోపు పంపాలన్నారు. దరఖాస్తుదారు 18-45 ఏళ్లలోపు ఉండాలని, 70 శాతం కన్నా ఎక్కువ శారీరక వైకల్యం కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ. 3 లక్షలకు మించకూడదన్నారు. అభ్యర్థులు పదవ తరగతి విద్యార్హత, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అభ్యర్థుల పేరిట ఎటువంటి వాహనాలు ఉండకూడదని, ఏలూరు జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. దరఖాస్తుతోపాటు సదరం, జిల్లా మెడికల్ బోర్డు జారీచేసిన ధ్రువపత్రం, ఆధార్, విద్యార్హత, తాజా ఆదాయ, కుల ధ్రువీ కరణ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్, ఫోటో, వాహనం లేదని స్వీయ ప్రకటన, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నకళ్ల దరఖాస్తుతో సమర్పించాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాఘవులు

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

- సోషలిజం అనివార్యం
- సీఐటీయూ రాష్ట్ర సదస్సులో బీవీ రాఘవులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పెట్టుబడిదారులపై పోరాడాల్సిన అవసరం ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు పేర్కొన్నారు. ఏలూరులో గురువారం జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగిన సీఐటీయూ రాష్ట్ర సదస్సులో రాఘవులు ముఖ్యఅతిథిగా పాల్గొని 'ప్రపంచ పరిణామాలు- సోషలిజం అనివార్యం' అంశంపై చర్చించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్పొరేట్ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారనడానికి న్యూయార్క్ మేయర్ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని, జోహ్రాన్ మమ్దానీ కమ్యూనిస్టు అంటూ ట్రంప్ ప్రచారం చేసినా ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారని భారతదేశంలోనూ అటువంటి పరిణామాలే రాబోతున్నాయి. అదానీ, అంబానీలాంటి వారికి ప్రయోజనం కలిగేలా మోదీ పరిపాలన సాగిస్తున్నారని, కార్మికులకు, పేదలకు ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవడంలేదు. సోషలిజం అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో అమలవుతున్న ఆర్థిక విధానాల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు చిత్రపటానికి రాఘవులు పూల మాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జీవీఎల్ నరసింహారావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.రమేష్, ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు జి.రాజు, డి.ఎన్.వి.డి. ప్రసాద్, పి.భారతి, కె.పోచమ్మ, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సుందరయ్య పాల్గొన్నారు. తొలుత జూట్‌మిల్లు సెంటర్ నుంచి సభా స్థలం వరకు భారీ ర్యాలీని ప్రదర్శించారు. అరుణ పతాకాలు రెపరెపలాడాయి. కళాకారులు విప్లవ గీతాలను ఆలపించారు. సాంస్కృతిక ప్రదర్శనలు జరిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం.. నిందితుల అరెస్ట్

భీమవరం క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): భీమవరం మెంటేవారి తోటలో మీనా బిస్కెట్స్ కంపెనీ వద్ద రేషన్ బియ్యంతో ఉన్న లారీని వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు ఫిర్యాదు మేరకు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని విశ్వసనీయ సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌తో వెళ్లి ఈ నెల 2న మెంటేవారి తోటలోకి వెళ్ళి లారీని పరిశీలించగా అందులో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించి ఆ బియ్యాన్ని వారు బ్లాక్ మార్కెట్‌లో అమ్మడానికి సిద్ధం చేసినట్లుగా తెలియడంతో విచారణ జరిపారు. మెంటేవారి తోటకు చెందిన మద్ది వెంకట సుబ్బయ్య, వీరవాసరం మండలం పెదవేగికి చెందిన లారీ యజమాని రావాడ లక్ష్మీ నరేంద్ర నాయుడు, అలాగే లారీ డ్రైవర్ పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన మద్దాల శివలను అరెస్ట్ చేశారు. వీరంతా రూ. 9 లక్షల 40 వేలు విలువైన 235 క్వింటాళ్ళు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు అక్రమంగా తరలిస్తున్నట్టు అంగీకరించారని ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం గోగుంట గ్రామ పరిధిలో కాలువ గట్టుపై గడ్డి కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొణికి గ్రామానికి చెందిన పండు వెంకటేశ్వరరావు(55) పశువుల మేత కోసం గురువారం ఉదయం 10 గంటల సమయంలో కాలువ గట్టుపై గడ్డి కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకటేశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, వీరిలో కుమారుడు పండు చైతన్య బాబు గత ఏడాది విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. తండ్రీకొడుకులు విద్యుత్ షాక్‌తో మృతి చెందడం ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): తన వివాహ సమయంలో కట్నం కింద రూ.7 లక్షల నగదుతో పాటుగా 12 కాసుల బంగారం, ఇతర లాంఛనాలు ఇచ్చినా అదనపు కట్నం కోసం తనను భర్తతో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ పెదపాడు శివారు రామచంద్రపురానికి చెందిన రథాల మైత్రి ఇచ్చిన ఫిర్యాదుతో పెదపాడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. బొబ్బిలి ప్రాంతానికి చెందిన ఆకుల నరేష్ ఎయిర్‌పోర్టు ఉద్యోగి కాగా, సూళ్లూరు (కోయంబత్తూరు)లో విధులు నిర్వహిస్తున్నాడు. కొంత కాలంగా అదనపు కట్నం కోసం భర్త నరేష్‌తో పాటుగా అత్త, ఆడపడుచు, బావతో పాటుగా మరికొందరు వేధింపులకు గురిచేస్తున్నారంటూ భార్య మైత్రి ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ వైర్లకు తగిలి లారీ దగ్ధం

ఏలూరు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): థర్మకోల్ షీట్ల లోడుతో వెళ్తున్న లారీ లోడుకు విద్యుత్ వైర్లు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి దగ్ధమైంది. దెందులూరుకు చెందిన నాగ హనుమాన్ ఆగ్రో ఆయిల్ ఫ్యాక్టరీకి చెందిన లారీలో థర్మాకోల్ షీట్లను వేసుకుని ఏలూరు సత్రంపాడు వెళ్తుండగా విద్యుత్ వైర్లు తగిలి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వెంటనే దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఏలూరు ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో జిల్లా అదనపు అగ్నిమాపక శాఖాధికారి వి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ ఇంజన్ సిబ్బంది వెంటనే వెళ్లి మంటలను ఆర్పారు. అప్పటికే లారీలోని థర్మాకోల్ షీట్లతో పాటు లారీ కూడా దగ్ధమైంది. సుమారు 10 లక్షల నష్టం వాటిల్లినట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. ఏలూరు త్రిటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):వేగంగా వెళుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు గుర్తు తెలియని యువకుడు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు నగరంలోని గిలకలగేటు సమీపంలో గురువారం ఉదయం ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్ బోగీ గుమ్మంలో నిలబడి ఉన్న ఒక యువకుడు ప్రమాద వశాత్తు జారిపడి మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు మృతుడు గచ్చకాయ రంగు ఉన్న గళ్ళ చొక్కా, ముదురు గచ్చకాయ రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు.

మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న ఒకరిపై కేసు

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.





క్రీడోత్సవాల్లో పాల్గొన్న వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లాల జట్లు

నేటి నుంచి అనంతపురంలో రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలు

అనంతపురం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు ఆర్డీటీ స్టేడియంలోని వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 27 జట్లు జిల్లాకు చేరుకున్నాయి. ఇందులో 26 జిల్లాల జట్లు, రెవెన్యూశాఖ రాష్ట్ర కార్యాలయం జట్టు ఉన్నాయి. మొత్తం 31 క్రీడాంశాలలో పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. కళాకారులు, క్రీడాకారులు స్టేడియంలో గురువారం రిహార్సల్స్ చేశారు. ఈ క్రీడోత్సవాల్లో ఉమ్మడి జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొని మార్చిఫాస్ట్ నిర్వహించి ఆకట్టుకున్నారు. రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి జేసీ శివ నారాయణస్వామి 27 జట్ల క్రీడాకారులకు స్వాగతం పలికారు. రిహార్సల్స్‌ను తిలకించారు. ఈ సందర్భంగా జేసీ, బొప్పరాజు మాట్లాడుతూ, అతిథులతో పాటు 27 జట్ల క్రీడాకారులకు ఆర్డీటీ స్టేడియంలో ఏర్పాట్లు చేశామని తెలిపారు.శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు క్రీడోత్సవాలు ఉంటాయన్నారు. మునుపెన్నడూ జరపని రీతిలో వైభవంగా క్రీడోత్సవాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.


రెండు ఆటోలు ఢీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీ కొని ఒక ఆటోలో నలుగురు మరో ఆటోలోని డ్రైవర్ తీవ్ర గాయాలయ్యాయి. చింతలపూడికి చెందిన ఆటో డ్రైవర్ కాజు చిన్న ఏసు అతని భార్య బేబీ కలిసి ప్రతిరోజు ఉదయం ఏలూరులో కూరగాయలు గొనుగోలు చేసి తమ ప్రాంతానికి తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. యథావిధిగా గురువారం ఉదయం భార్యాభర్తలు ఆటోలో ఏలూరు వస్తున్నారు. బుట్టాయగూడానికి చెందిన ఆటో డ్రైవర్ కర్రి ఫ్రాన్సిస్ తన ఆటోతో ఏలూరు నుంచి చింతలపూడి వెళ్తున్నాడు.ఈరెండు ఆటోలు ఏలూరు సమీపంలోని వంగూరు బ్రిడ్జి దగ్గరలో ఉన్న బాలాజీ కన్వర్షన్ హాలు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చిన్న ఏసుకు చేయి విరిగింది. భార్య బేబీకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆటోలోని ప్రయాణికులు శ్రీధర్‌రెడ్డి, విజయరాయికి చెందిన విద్యార్థిని మానసకు కూడా తీవ్రగాయాలయ్యాయి. బుట్టాయిగూడేనికి చెందిన ఆటో డ్రైవర్ కర్రి ఫ్రాన్సిస్ మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు. ఇతని పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో విజయవాడకు తరలించారు. మిగిలిన క్షతగాత్రులు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

విద్యార్థులకు అవగాహన కల్పించిన డీటీసీ కరీమ్

ఏలూరు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. గురువారం ఏలూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై తమ వాహన తనిఖీ అధికారులు అవగాహన కల్పించినట్టు కరీమ్ తెలిపారు.గురువారం ఏలూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై తమ వాహన తనిఖీ అధికారులు అవగాహన కల్పించినట్టు కరీమ్ తెలిపారు. రహదారి నియమ నిబంధనలు పాటించకపోవడం వాహన చోదకులతో పాటూ ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమన్నారు. రహదారి నియమాలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాల సంఖ్యను తగ్గించవచ్చని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు లేని పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే హెల్మెట్లు, సీట్ బెల్టును ధరించి మాత్రమే వాహనాలు నడపాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్ తప్పక పొందాలని, రహదారి నియమాలను పాటిస్తూ రహదారి ప్రమాద రహిత దేశాన్ని నిర్మించడం భావితరంపై ఆధారపడి ఉందని కరీమ్ అన్నారు.విద్యార్థులు కూడా రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలను నడపడం శోచనీయమన్నారు. ప్రతి పౌరుడు తమ హక్కులతో పాట విధులను పాటిస్తే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని డీటీసీ కరీమ్ అన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

భీమడోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలం ఆగడాలలంకలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై భీమడోలు పోలీసులు దాడి చేసి 9మందిని అరెస్టు చేశారు. పాడుబడ్డ ఇంట్లో పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి రూ.42 వేల 700 నగదు స్వాధీన పర్చుకుని వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సింగగూడెంలో నలుగురి అరెస్టు..

లింగపాలెం: పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారిపై కేసునమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. మండలంలోని సింగగూడెం శివారులో పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2050 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని వారిపై కేసునమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కే వెంకన్న తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలంలోని చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వేస్టును ఐషర్ వాహనంలో తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి గురువారం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహనంతో పాటు చికెన్ వ్యర్థాలు స్వాధీనం చేసుకుని డ్రైవర్, వాహన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

భీమవరం క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఈ నెల 3న భీమవరం ప్రభుత్వాసుపత్రికి గుండెలో నొప్పి వస్తుందంటూ వైద్యం కోసం వచ్చిన వ్యక్తి వైద్యులు పరిశీలించే లోపుగానే గుండెపోటుతో చనిపోయాడని ఆయన తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోని సెల్ నెంబర్స్ 94407 96632, 94407 96633 లకు సంప్రదించాలని సీఐ కోరారు.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పెదవేగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):పెదవేగి గ్రామానికి చెందిన కొలికిపాముల రాజేష్ లోతట్టులో ఉన్న ఇంటిని మెరక చేయడానికి చెరువు మట్టిని ట్రాక్టర్‌తో తరలిస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో ట్రాక్టర్ రాజేశ్ ట్రాక్టర్‌కు తగిలింది. దీంతో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. దీంతో రాజేశ్ ట్రాక్టర్‌పైనుంచి కింద పడటంతో తల, కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. రాజేశ్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారని పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కొల్లేరులో వ్యవసాయానికి అనుమతి ఇవ్వాలంటూ ఎమ్మెల్యేకు వినతి

నిడమర్రు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కొల్లేరులో వ్యవసాయం చేసుకోవడానికి అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వద్ద మొరపెట్టుకున్నారు. గురవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధర్మరాజును నిడమర్రు మండలం ఆముదాలపల్లి, తోకపల్లి, బైనేపల్లి గ్రామస్థులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు సానుకూలంగా స్పందించి అటవీ, వ్యవసాయ శాఖ అధికారులతో మట్లాడి సమస్యను పరిష్కరిస్తాని హామీ ఇచ్చారు.

మొబైల్‌కు దూరంగా ఉండాలి

ఏలూరురూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయమానసిక ఆరోగ్యకార్యక్రమంలో భాగంగా శనివారపుపేట జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్య జిల్లా అధికారిణి కె.హెచ్.కోమలి మానసిక ఆరోగ్యప్రాముఖ్యతను వివరించారు. మొబైల్ వల్ల వచ్చే మానసిక, శారీరక సమస్యలపై అవగాహన కల్పించారు. మానసిక సమస్యలు ఎదురైతే 14416 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చెయ్యాలన్నారు. రజిత, జయశుభ, సామాజిక కార్యకర్త ఎల్.తిరపతిస్వామి పాల్గొన్నారు.

'పోలవరం నియోజకవర్గాన్ని' ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

బుట్టాయగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని గురువారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీలకు అడుగడుగునా అన్యాయమే జరుగుతుందన్నారు. రంపచోడవరం కేంద్రం ప్రత్యేక జిల్లాను ఇస్తామని చంద్రబాబు ప్రకటించినా అధికారంలోకి రాగానే ఆదివాసీలకు ఉన్న ఒక్క జిల్లాను ముక్కలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను యథావిధిగా కొనసాగించాలని, పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించి పూరెం సింగరాజు దొర పేరు నామకరణం చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక జిల్లా డిమాండ్‌తో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు కొమరం వెంకటేశ్వర్లు, కుంజం కృష్ణంరాజు, తెల్లం లక్ష్మణరావు, రవ్వ బసవరాజు, సోదెం వెంకటేశ్వర్లు, కొవ్వాదయ్య, ప్రసాదు పాల్గొన్నారు.

ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా కారం తమ్మన్న దొర పేరుతో ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఏలూరు జిల్లా ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాన్ని రెండు, మూడు జిల్లాలుగా చేయాలని 2014 నుంచి ఆదివాసీలు డిమాండ్ చేస్తూనే ఉన్నారని తెలిపారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఉభయ గోదావరి జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాన్ని, విలీన మండలాలను కలిపి ఒక జిల్లాగా చేయాలన్నారు. ఐటీడీఏ కేంద్రమైన బుట్టాయగూడేన్ని పోలవరం జిల్లా కేంద్రంగా ప్రకటించి గోపాలపురం, టినర్సాపురం మండలాల్లోని 28 ఆదివాసీ గ్రామాలు చేర్చాలన్నారు.

ఏకోపాధ్యాయ సెలవుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు వినతి

ఏలూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్లు సెలవులు పెట్టినపుడు ప్రత్యామ్నాయ బోధనా ఏర్పాట్లపై ఎంఈవోలు అనుసరిస్తున్న వైఖరి సరిగాలేదని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాంబాబు గురువారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. సింగిల్ టీచర్ ఉన్న స్కూల్లో సంబందిత ఉపాధ్యాయుడు సెలవుపెడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను టీచరే చూసుకోవాలని ఎంఈవోలు చెబుతున్నారని ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం సమీప పాఠశాల నుంచి ఒక టీచరును డిప్యూటేషన్‌పై పంపించాల్సిన బాధ్యత ఎంఈవోలపైనే ఉంటుందని, ఈ నియమాన్ని జిల్లాలోని ఎంఈవోలంతా పాటించేలా ఆదేశాలివ్వాలని కోరారు. గత విద్యాసంవత్సరంలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా సెలవుదినాల్లో పనిచేసిన హైస్కూలు టీచర్లకు సీసీఎల్‌ను మంజూరు చేస్తామని చెప్పినా ఇంతవరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదని, వెంటనే సీసీఎల్‌ను లీవ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో దంతవైద్య విద్యార్థుల నర్సింగ్ సేవలు

పెదవేగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు ప్రభుత్వ ఆసుపత్రి,వైద్య కళాశాలల్లో నర్సింగ్ సేవలు అందించేలా ప్రభుత్వం అనుమతినిచ్చిందని కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు తెలిపారు. ప్రభుత్వ కార్యదర్శి జి.వీరపాండ్యన్ ఆదేశాల మేరకు సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నర్సింగ్ సేవలు అందించేందుకు నిబంధనలతో కూడిన అనుమతులిచ్చిందన్నారు. నర్సింగ్ శిక్షణతో మరింత మెరుగైన అనుభవం ఉంటుందని, నాక్ గుర్తింపు తరువాత ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో దంతవైద్య కళాశాల విద్యార్థులు క్లినికల్ సౌకర్యాలను వినియోగించుకోవడం ఎంతో గర్వకారణమని ఫాదర్ మోజేస్ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్‌పై అవగాహన


మొక్క నాటిన మానవ చైర్ పర్సన్ నిర్మల

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు మానవత సంస్థ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తోంది. ఈ మేరకు ఏలూరు మానవత చైర్ పర్సన్ ఎ.నిర్మల, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వై.నిర్మల ముఖ్య అథులుగా పాల్గొని పాఠశాలలో ముందుగా మొక్కను నాటారు. వక్తలు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలన్నారు. క్యాన్సర్ నివారణకు అవగాహనతో పాటే ఆరోగ్యపరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్ కుమార్, జి.మోహన్, ఉపాధ్యాయులు కుమార్ స్వామి, ప్రసాద్‌బాబు, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఎంఈఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, విఘ్నేశ్

జంగారెడ్డిగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జంగారెడ్డిగూడెం పురపాలక సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా రేలంగి నాగరాజు, కూనపాముల విఘ్నేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ ఎంఈఎఫ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా సోమయ్య నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సోమయ్య మాట్లాడుతూ నూతన కార్యవర్గం మున్సిపల్ కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలని సూచించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఏఎస్పీ సుస్మిత రామనాథన్‌కు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు

జంగారెడ్డిగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సుస్మిత రామనాథన్‌ను గురువారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషుతో పాటు పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శేషు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో గంజాయి, దొంగనోట్లు, బహిరంగ మద్యపానం, చైన్ స్నాచింగ్, చోరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. శ్రీనివాసపురం సొసైటీ అధ్యక్షుడు గంధం గోపాలకృష్ణ, టీడీపీ తెలుగు రైతు మండలాధ్యక్షుడు ఎలికే ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, పులపాకుల ప్రసాద్, కొప్పుల రాంబాబు, బల్లే సత్యనారాయణ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: జంగారెడ్డిగూడెం అడిషనల్ ఎస్పీ సుశ్మితను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జయ్యవరపు శ్రీరామ్మూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి, జంగారెడ్డిగూడెం క్యాంపు కార్యాలయంలో కలిసి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, తమ ప్రాంతంలోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు.

నూకాలమ్మ ఆలయంలో నేడు లక్ష దీపార్చన

జంగారెడ్డిగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో ఉన్న శ్రీనూకాలమ్మ ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారి లక్ష కార్తీక దీపారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని భక్తులు అధిక సంఖ్యలో లక్ష దీపార్చనలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నూకాలమ్మ ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ రాజాన పండు కోరారు. గురువారం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, 81వ చండీ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని రాజాన పండు తెలిపారు.

సాయి మందిర్‌లో అభిషేకాలు, అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక గురువారం నేపథ్యంలో స్థానిక ఆదివారపుపేటలోని శ్రీ షిర్డీసాయి ప్రేమ మందిర్ వద్ద భక్తులు బాబాకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బాబా వారి సన్నిధిలో కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. సాయినామ స్తోత్రాలను పఠించారు. భజనలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా పల్లకీ సేవా కార్యక్రమంలో సాయినామ సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా మందిర అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు భక్తులకు, స్వాములకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. కార్తీక పూజలతో సాయి మందిరం భక్తులతో కిటకిటలాడింది.

పాఠశాలకు మిక్సీ అందజేత

ఉంగుటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కైకరం కొత్తూరు ఎంపీపీ పాఠశాలకు అక్కుపల్లి గోకవరం గ్రామానికి చెందిన ఇనగళ్ల భారత సత్యనారాయణ దంపతులు వంట నిమిత్తం కొత్త మిక్సీని ప్రధానోపాధ్యాయుడు షప్పాల నరసింహారావుకు అందజేశారు.

ప్రమాదంతో ప్రయాణం..

అదుపు తప్పితే ఇక అంతే..
చూసీచూడనట్టు వదిలేస్తున్న పోలీసులు


వీరమ్మకుంట సమీపంలో పడిన లారీ(ఫైల్)


వెళ్తున్న లారీపై నిద్రిస్తున్న కూలీలు

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండల పరిధిలో చుట్టుపక్కల, కొల్లేరు పరిసర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో చేపల, రొయ్యల సాగు జరుగుతోంది. దీంతో నిత్యం ఆయా చెరువుల పరిధిలో చేపలు, రొయ్యల పట్టుబడులు జరుగుతూనే ఉంటాయి. పట్టుబడి పట్టిన రొయ్యలు, చేపలను ఐస్‌లో ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలించేందుకు లారీలు, వ్యాన్లు వస్తుంటాయి. కేవలం రవాణా ఖర్చు తగ్గుతుందనే భావనతో ప్యాకింగ్ కూలీలు కూడా అదే లారీ, వ్యాన్ల పైభాగంలో ప్రయాణిస్తూ చేపల చెరువులను చేరుకుంటున్నారు. వీరి ప్రయాణం ఎక్కువగా ఉదయం 3 గంటల నుంచే ప్రారంభమవుతుంది. అంటే ఆ సమయంలో లారీపై భాగంలో ఐస్ ట్రేలపై నిద్రిస్తూ, కూర్చొని ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నారు. గతుకులు, గుంతల రహదారుల్లో, మలుపుల్లో లారీ ఏదైనా ప్రమాదానికి గురైతే వీరంతా లారీ, ఐస్‌ట్రేల కింద పడి నలిగిపోవాల్సిందే.. ఇలాంటి ప్రమాదాలు గతంలోనూ వీరమ్మకుంట పరిసర ప్రాంతాల్లో జరిగిన ఘటనలున్నాయి. నిత్యం కళ్ల ముందే ప్రయాణిస్తున్న వీరిని పోలీసు, అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలూ ఉన్నాయి. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరగక ముందే ఇటువంటి ప్రయాణాలను నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య

శతవార్షికోత్సవాలు జయప్రదం చేయాలి

చింతలపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పార్టీ నిర్మాణం, ప్రజా సంఘాలు ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే శతవార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు విషయాలు మాట్లాడారు. సమావేశానికి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా టి.నర్సాపురం, చింతలపూడి, వేలేరుపాడు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, జీలుగుమిల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు. నాయకులు కె.దారయ్య, ఎం.వసంతరావు, బి.రాము, టి.బాబు, టి.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయండి

చింతలపూడి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజల అభ్యర్థన మేరకు శ్మశాన వాటికలకు స్థలాలు సేకరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నాలుగు మండలాల తహసీల్దార్లను ఆదేశించారు.గురువారం క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. శ్మశాన వాటికల స్థలాలు లేకపోవడంతో రోడ్ల పక్కనే అంతిమ సంస్కారాలు చేయడం బాధాకరమని, అందుకోసం గ్రామాలలో శ్మశాన వాటికలకు స్థల సేకరణ జరిపి నివేదిక ఇవ్వాలని సూచించారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

బీమా సొమ్ము ఇప్పించిన ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ బీమా పథకంలో పేరు నమోదై ఉన్న వ్యక్తి 2022లో ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మృతిచెందాడు. మృతుడు టీడీపీ సానుభూతిపరుడనే నెపంతో నాడు వైసీపీ నాయకులు అతడికి రావాల్సిన వైఎస్సార్ బీమా సొమ్ము రాకుండా చేశారు. దీంతో ప్రస్తుత ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ప్రభాకర్ సహకారంతో పెదవేగి మండలం జానంపేటకు చెందిన కర్రి బాబ్జి కోర్టును ఆశ్రయించగా వాదనల అనంతరం బీమా సొమ్ము చెల్లించాలని కోర్టు ఆదేశించడంతో ఓరియంటల్ సంస్థ రూ.5.10 లక్షలు అందించింది. ఆ చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్ దుగ్గిరాల కార్యాలయంలో గురువారం అందించారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని, పార్టీలకు అతీతంగా పేదలకు అండగా నిలుస్తుందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శనివారపుపేటలో ఐక్యతా ర్యాలీ

పెదవేగి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవ ఎనలేనిదని సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గురువారం పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారపుపేట నుంచి దుగ్గిరాల వరకు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, ఐక్యత, సమగ్రత సందేశాలు వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శన చేశారు. ఫాదర్ మోజేస్ మాట్లాడుతూ చిన్న చిన్న సంస్థానాలను కలిపి విశాల భారతావనిగా తీర్చిదిద్దారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, ఏవో ఫాదర్ ఫెలిక్స్, ప్రజాదంత వైద్య విభాగం హెచ్‌వోడీ డాక్టర్ పావనసంధ్య, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జ్ డాక్టర్ టి.ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్‌ల పంపిణీ

జీలుగుమిల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయడం శుభ పరిణామని అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. దర్భగూడెంలో హోప్ మినిస్ట్రీస్, సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. అనంతరం మమత మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సుమారు 100మంది వైద్య సదుపాయాల్ని వినియోగించుకున్నారు. గెడ్డం జాషువా, ఎజ్రాశాస్త్రి, దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు అక్కిశెట్టి ప్రసాద్, హనుమంతరావు, గంగిరెడ్డి, పద్దం వెంకట కృష్ణ, సాంబ, చిరంజీవి, సుబ్బారెడ్డి ఉన్నారు.

క్రీడా సమాచారం..

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



టి.నర్సాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మక్కినవారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని యర్రం శెట్టి అనసూర్యతేజ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థినికి గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ నెల 4న పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బేస్‌బాల్ బాలికల అండర్ - 14 విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఎంపికైన అనసూర్యతేజతో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రమేశ్‌ను ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు.

పరుగు పందెంలో ధరణి ప్రతిభ



కొయ్యలగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పరుగు పందేనికి కొయ్యలగూడెం మేధా పాఠశాల విద్యార్థిని ధరణి ఎంపికైనట్టు కరస్పాండెంట్ ఎన్.మధు తెలిపారు. ఈ విద్యార్థిని అండర్ - 14లో శ్రీకాకుళంలో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ప్రిన్సిపల్ ధనరాజు, పీఈటీ శ్రీనివాసరావు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి జూడో పోటీల్లో పి.శరత్, జి.హర్ష, పి.శివరామకృష్ణ, కె.శ్రీనివాస్ కల్యాణ్, బి.జగదీశ్‌కుమార్, సిహెచ్ యతిక్ రత్న, జి.జాన్‌పాల్, పి.మరియజోష్, ఎ.శశాంక్ ప్రతిభ కనపరిచారు. కాకినాడలో ఈ నెల 7,8 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వీరిని ఎంపిక చేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ కౌశర్‌బేగం, హెచ్ఎం ప్రకాశ్‌రావు, పీడీ ప్రేమలత, జూడో కోచ్ చందు విద్యార్థులను అభినందించారు.

స్కేటింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



ఏలూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఏలూరు ఇండోర్ స్టేడియం క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.ఎ.అజీజ్ అభినందించారు. ఇటీవల కాకినాడలో 37వ రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో స్కేటింగ్ క్రీడాకారులు ఎం.శ్రేష్ఠ, అండర్ 6 విభాగంలో రజిత, అండర్ 14 విభాగంలో ఎన్.భువనరత్నశ్లోక రజిత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకరులు డీఎస్‌డీవోను కలిశారు. కోచ్ ఖాసీంను అభినందించారు.

రాష్ట్ర స్థాయికి పంగిడిగూడెం విద్యార్థి



ద్వారకాతిరుమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పంగిడిగూడెం జెడ్పీ హెచ్ ఎస్ విద్యార్థి ఉండ్రాజవరపు మహికుమార్ ఎంపిక య్యాడు. అండర్-14 హైజంప్ విభాగంలో ఈ బాలు డు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎం.కౌసల్య, పీడీ జి.ఎన్.సుధ తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామపెద్దలు విద్యార్థి మహికుమార్‌ను అభినందించారు.

బేస్‌బాల్‌లో తోకలపల్లి విద్యార్థుల ప్రతిభ

నిడమర్రు నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఎస్.జి.ఎఫ్ ఆధ్వర్యంలో పెదవేగి గురుకుల పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో తోకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బేస్‌బాల్ అండర్ -14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు తోకలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.జశ్వంత్, అండర్ -14 సాఫ్ట్‌బాల్ జట్టుకు జి.సింధూజ, అండర్ -17 బేస్‌బాల్ జట్టుకు జి.సంధ్యారాణిలు ఎంపికైనట్టు హెచ్ఎం గోపాలకృష్ణ తెలియజేశారు.కర్నూలు, అనంతరపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారు. ఈ మేరకు వీరిని ఎంఈవోలు అనూరాధ, శేషగిరిరావు, ఏఎంసీ చైర్మన్ ఏడుకొండలు అభినందిచారు.


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో క్వాంటమ్ 9ఎక్స్ స్టార్టప్ ఆవిష్కరణ

పెదపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):నూతన ఆవిష్కరణలతోనే దేశ ప్రగతి ముందుకెళ్తుందని పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఈసీఈ విద్యార్థులు ధనుష్ మోహన్, తుమ్మల శ్రీజా, పిల్లక పణిలు కలిసి స్థాపించిన క్వాంటమ్ 9 ఎక్స్ (ఐటీ సర్వీసెస్ అండ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ) అనే వినూత్న స్టార్టప్‌ను ప్రిన్సిపాల్ డాక్టరు వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా పైథాన్, ఫుల్‌స్టాక్ డవలప్‌మెంట్, ఏఐ వంటి ఆధునిక, సాంకేతిక కోర్సులను సులభంగా, తక్కువ ధరకే నేర్చుకునే వీలు కలుగుతుందన్నారు.


రైతులకు ఉపకరణాలందిస్తున్న చైర్మన్ పోలిన

రైతులకు మెరుగైన సౌకర్యాలు

ద్వారకాతిరుమల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సౌకర్యాలను కల్పించి అన్ని విధాలా వారికి కావాల్సిన వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తెచ్చామని ద్వారకాతిరుమల సొసైటీ చైర్మన్ పోలిన శ్రీనివాసరావు అన్నారు. సొసైటీలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన పరికరాలు, ఎరువులు సొసైటీ పరిధిలో అందుబాటులో ఉన్నాయన్నారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. డైరెక్టర్లు చిలుకూరి సూర్యావతి, లక్కాబత్తుల మహేశ్వరి, సీఈవో నల్లూరి శ్రీకిషోర్, మటపర్తి బద్రి, ఏపూరి కిషోర్, తిమ్మాపురం ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత, ఘంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రోషన్

ఉద్యోగ విరమణ చేసిన ఎంఈవోకు సన్మానం

లింగపాలెం, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన కంఠా రామారావు దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ రామారావు ఉపాధ్యాయ వృత్తిలో 39 ఏళ్లు పనిచేసి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో కె.వాణి, ఎంఈవోలు జె.రవీంద్ర, కిరణ్ బాబు, ఎస్.నరశింహమూర్తి పాల్గొన్నారు.

చిత్తూరులో వేధింపులపై నిరసన

ఏలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చిత్తూరు వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ ఇటీవల సిబ్బందిపై చేపట్టిన వేధింపులను నిరసిస్తూ ఏపీ సిటీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ పిలుపు మేరకు నగరంలోని వాణిజ్య పన్నుల శాఖ ఏసీ-2 కార్యాలయం వద్ద సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు కె.చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీ జి.జాన్‌బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

కొయ్యలగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదప్రజలందరికి ప్రభుత్వ పథకాలు అందేలా మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని రాష్ట్ర మహిళా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మేఘలాదేవి కోరారు. గురువారం ఆమెను పట్టణంలోని పలువురు కలిసి తమకు అర్హత ఉన్న పింఛన్లు రావడంలేదని మొరపెట్టుకున్నారు. దీంతో ఆమె స్పందించి సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వదేశీ వస్తు వినియోగంపై అవగాహన

బుట్టాయగూడెం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువుల వినియోగించి దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలాధ్యక్షుడు కోనూరి నరేశ్ అధ్యక్షతన గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌బిటిఎస్ బాబు హాజరై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ స్వదేశీ వస్తువుల వినియోగంపై ప్రచారం చేసినట్లు జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షురాలు వంకా కాంచనమాల తెలిపారు. నాయకులు కొండే పాటి రామకృష్ణ, దెయ్యాల రామాంజనేయులు, గొల్లపర్తి స్వరాజ్య లక్ష్మీ, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకోండి : తహసీల్దార్

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇంటి స్థలాలు పొందినవారు వెంటనే ఇళ్లు నిర్మించుకోవాలని జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజి అన్నారు. గురువారం మండలంలోని లక్కవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలం పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే వాటిని రద్దు చేయడం జరుగుతుందన్నారు. హౌసింగ్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

భీమడోలు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాల పట్ల యువత అవగాహన కల్గి ఉండాలని ఎస్ఐ మదీనాబాషా అన్నారు. భీమడోలు జడ్పీ హైస్కూల్లో పోక్సో సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మదీనా బాషా పాల్గొని మాట్లాడుతూ సోషల్ మీడియాలో పరిచయమయ్యే అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని వ్యక్తిగత సమాచారం బహిర్గతం చేయవద్దని సూచించారు. పోలీసు సిబ్బంది పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య సఖ్యత ఉండాలి

ఏలూరు అర్బన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కొత్తగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశించిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకను నిర్వహించారు. ముఖ్య అతిథిగా గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి హాజరయ్యారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లితండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. జూనియర్ విద్యార్థులతో సఖ్యత, సమన్వయం కలిగిఉండాలని సీనియర్లను కోరారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ మూడేళ్లలో విద్యార్థులు పాటించాల్సిన ప్రణాళికను వివరించారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఏఐ వంటి కోర్సులను కళాశాలలో అందుబాటులోకి తెచ్చామన్నారు. జూనియర్ విద్యార్థులను ఆహ్వానిస్తూ సీనియర్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైస్‌ప్రిన్సిపాల్ అజయ్ కుమార్, అధ్యాపకులు రమేశ్, పద్మావతి, విజయ్‌కుమార్, పరమేశ, కళాశాల సీడీసీ కార్యదర్శి రఘుబాబు పాల్గొన్నారు.

కార్పొరేషన్ సెక్రటరీగా లక్ష్మయ్య

ఏలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):ఏలూరు నగరపాలకసంస్థ సెక్రటరీగా పి.లక్ష్మయ్య నియమితులయ్యారు. గ్రేడ్- కేడర్‌లో పనిచేస్తున్న ఈయన బాపట్ల మున్సిపాల్టీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. పురపాలకశాఖ ఉన్నతాధికారులు బదిలీల్లో భాగంగా ఏలూరుకు ఆయనను బదిలీ చేశారు.

ఇడా ఏవోగా ఉదయ్ భాస్కర్: ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా తణుకులో శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ ఉదయ్‌భాస్కర్ బదిలీపై నియమితులయ్యారు.

సబ్సిడీపై డ్రోన్ అందజేత

ఉంగుటూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నిడమర్రు మండలానికి చెందిన పెదనిండ్రకొలను రైతుకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ పరికరాన్ని అందజేశారు. అలాగే ఏలూరు కాలువ సంబంధించి పాతూరు రైతులు రేవుల ఏర్పాలు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. నిడమర్రు మండలం తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు తమను వ్యవసాయం చేసుకోనివ్వడం లేదని దీనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సంబంధిత శాఖాధికారులతో మాట్లాడారు.

వనసమారాధనకు ఆహ్వానం..

ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు కాపునాయకులు 9న నిర్వహించే కాపు వనసమారాధనకు హాజరు కావాలని ఎమ్మెల్యేను కోరారు.


విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

ఆంజనేయులు విగ్రహావిష్కరణ

ఉంగుటూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి విశేష కృషిచేసిన దివంగత వ్యాపారవేత్త బూరుగుపల్లి ఆంజనేయులు ధన్యుడని గోపాలపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో వారి పెట్రోలు బంక్ వద్ద తనయుడు నాగేంద్ర ఆధ్వర్యంలో గురువారం విగ్రహా ఆవిష్కరణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి ఆంజనేయులు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మంచినీటి సరఫరా పథకాన్ని ఆవిష్కరించారు. చేబ్రోలు సర్పంచ్ రాందేలక్ష్మిసునీత, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): తనతో సహజీవనం చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడని పెదకోమర్రుకు చెందిన పీవీ సూర్యనారాయణపై ముదినేపల్లి మండలం అన్నవరం కాలనీకి చెందిన దళిత మహిళ ఫిర్యాదు మేరకు ఈ నెల 3న నమోదైన అట్రాసిటీ కేసుపై గురువారం ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ విచారణ జరిపారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ముదినేపల్లి ఎస్ఐ వీరభద్రరావుతో కలసి డీఎస్పీ అన్నవరం కాలనీలో ఫిర్యాదుదారు నివాస పరిసర వాసులను విచారించారు. అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు.

క్రైస్తవ సంప్రదాయంలో వివాహం

చాట్రాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సర్వమతాల సారం ఒక్కటే అని దీనిని అందరూ గౌరవిస్తే మత సామరస్యం వెల్లివిరుస్తుందని టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సి. గుడిపాడు షాలేము చర్చిలో గురువారం క్రైస్తవ సాంప్రదాయ ప్రకారం జరిగిన వివాహానికి హాజరై వధూవరులు ఉదయ్‌కుమార్, మంగాదేవిని ఆశీర్వదించారు. పాస్టర్లు జాన్‌బాబు, సంసోను, రవికుమార్ వివాహం జరిపించారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న త్రివిధ పాఠశాల విద్యార్థులు

విద్యార్థుల ప్రదర్శన

నూజివీడు టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నూజివీడు వాసుల సెంటిమెంటును గౌరవిస్తూ నూజివీడు నియోజకవర్గాన్ని తిరిగి ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేస్తూ మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలుపుతూ నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ప్ల కార్డులను పట్టుకుని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో హర్షధ్వానాలను వ్యక్తం చేశారు. త్రివిధ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్, సిటిజన్ ఫోరం తరుపున ప్రముఖ న్యాయవాది ఫరూక్ ఎం రాజశేఖర్, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రి సారథి ఆర్థిక సాయం

నూజివీడు టౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన షిఫ్ట్ ఆపరేటర్ ఆర్. నాగరాజు కుటుంబ సభ్యులకు మంత్రి పార్థసారథి నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. నూజివీడు మండలం జంగంగూడెం గ్రామానికి చెందిన నాగరాజు ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబానికి నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని టీడీపీ నాయకుల ద్వారా అందజేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు హనుమంతరావు, నాయకులు పొట్లూరి అశోక్, వల్లభనేని భాస్కర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు తక్షణం ఇళ్లు నిర్మించాలి

చాట్రాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): లేఅవుట్ కాలనీలలో స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ మిద్దె శివాజీ, టీడీపీ గ్రామ అధ్యక్షురాలు బొర్రా నాగమల్లీశ్వరి కోరారు. పర్వతాపురంలో గురువారం జరిగిన గ్రామసభలో హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్వతాపురం లే అవుట్‌లో 43 మందికి పట్టాలు ఇవ్వటం జరిగిందని, నిబంధనల ప్రకారం లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణం చేపట్టి సొంతింటి కలను నిజం చేసుకోవాలని, ఒక్కో లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు చొప్పున బిల్లులు చెల్లిస్తుందని అన్నారు. కూటమి నాయకులు దిలీప్‌కుమార్, మేకపోతుల వెంకటేశ్వరరావు, బొర్రా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బాలికలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు గురుకుల బాలికలు

మునునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మునునూరు గురుకుల పాఠశాల బాలికలు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5న గన్నవరంలో జిల్లాస్థాయిలో జరిగిన యోగా పోటీల్లో అండర్-17 విభాగంలో ఎల్.అను, కె.తాప్సి, సీహెచ్.దీపిక, జి.లోహిత, అండర్-14 విభాగంలో జె.హారిక ఉత్తమ ప్రతిభను కనబర్చి ఈ నెల 23, 24 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ కుమారి తెలిపారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు..

అలాగే ఈ నెల 4వ తేదీన మునునూరు పాఠశాలలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో సీహెచ్.సాయివర్షిణి, కె.చంద్ర, జె.హారిక, జి.మోక్షజ్ఞ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. గురువారం బాలికలను ప్రిన్సిపాల్, పీడీ నాగమల్లేశ్వరీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



కలిదిండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భాస్కరరావుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తాడిబిందు మాధవి, చాలంటి సుకన్య ఎంపిక య్యారని హెచ్‌ఎం ఎం.సునీల జ్యోతి తెలిపారు. గుడివాడలో ఈ నెల 5న జిల్లాస్థాయి అండర్-14 బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. స్కూల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మంతెన సుబ్బరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ శుభాకర్, పీడీ కుంభా సాంబశివరావు, హెచ్‌ఎం జ్యోతి బాలికలను అభినందించారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల సార్వా వరి పంట నష్టపోయిన రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కోరారు. ముదినేపల్లి మండలం వణుదుర్రు గ్రామంలో తుఫాను వల్ల దెబ్బతిన్న వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో దుబ్బుల కోడు డ్రైయిన్ పూడిపోవడం వల్ల సుమారు 200 ఎకరాల్లోని వరిపైరు ముంపునకు గురై నష్టం కలిగిందని, డ్రెయిన్లలో డెక్క తొలగింపునకు నీటి సంఘాల ప్రతినిధులు, అధికార్లు చర్యలు తీసుకోవాలని కోరారు. వణుదుర్రు, ప్రొద్దువాక సర్పంచ్‌లు చిన్నం సుగుణరావు, సింగరపల్లి రామకృష్ణ, వైసీపీ మండల అధ్యక్షుడు బోయిన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యేనా?


సింగరాయపాలెంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కేడర్ ఆలయమైన ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకం ఇప్పట్లో జరుగుతుందా లేదా అన్నది చర్చనీయాంశమైంది. ఈ నెల 26న ఆలయం లో ప్రారంభం కానున్న షష్ఠి కల్యాణ మహోత్సవాల లోపు ధర్మకర్తల మండలి ఏర్పాటుకు కూటమి నాయకులు చేస్తున్న ప్రయత్నాలకు దేవదాయశాఖ కమిషనర్ ఆమోద ముద్ర పడుతుందా లేదా అన్నది ప్రశ్నార్థకం. గత ఏడాది షష్ఠి ఉత్సవాల సమయంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ధర్మకర్తల మండలి నియామకానికి కూటమి నాయకుల ఏకాభిప్రాయంతో ఒక జాబితా పంపగా

షష్ఠి సమీపిస్తున్నా ధర్మకర్తల మండలి ఏర్పాటుకాకపోవడంపై సర్వత్రా చర్చ

అప్పట్లో సమయం చాలక ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. నాలుగు నెలల క్రితం ఈ ఆలయానికి తిరిగి ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయశాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేయగా పాత జాబితానే ఎమ్మెల్యే ద్వారా మళ్లీ పంపారు. అయితే కొన్ని అభ్యంతరాల నేపథ్యంలో ధర్మకర్తల మండలి ఖరారు కాలేదు. ఈ పరిస్థితుల్లో మరో 20 రోజుల్లో షష్ఠి కల్యాణోత్సవాలు ప్రారంభం కానున్నందున పూర్తిస్థాయిలో ధర్మకర్తల మండలి నియామకం జరుగుతుందా లేక ఈ సారి కూడా ఉత్సవ కమిటీని తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారా అన్నది ప్రశ్నార్థకం.

అర్హులకు ఇళ్ల స్థలాలు : సబ్ కలెక్టర్


లబ్ధిదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మునునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అన్నారు. గత టీడీపీ హయాంలో 2018లో లక్ష ఇళ్ళ పట్టాల కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు కేటాయించిన లే అవుట్‌ను గురువారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు సెంట్లు చొప్పున 116 మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చారని, ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళ పాలనలో తమకు రాళ్ళు వేసి, పొజిషన్ చూపించ లేదని లబ్ధిదారులు వివరించారు. ఇంటి స్థలం లేక జడ్పీ పాఠశాల సమీపంలో ఉన్న చెరువు పోరంబోకు భూమిలో నివాస గృహాలు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్ళదీస్తున్నామని పట్టాలు పొందిన సుమారు 40 మంది బాధితులు సబ్ కలెక్టర్ వద్ద వాపోయారు. అనంతరం లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ళ పట్టాలను ఆమె పరిశీలించారు. పాఠశాల పక్కన చెరువు పోరంబోకులో నివాసం ఉంటున్న వారికి సైతం లేవుట్‌లో ఇళ్ళ స్థలాలను కేటాయిస్తామని, ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే అక్కడ ఇళ్ళు ఖాళీ చేయాలని ఆమె సూచించారు. సర్పంచ్ గద్దల మోహన్‌రావు, ఎంపీటీసీ నాగమంజుల శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రశాంతి, టీడీపీ గ్రామ అధ్యక్షులు మొక్కపాటి వెంకట రామారావు, డీసీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు లోకుమూడి విద్యార్థిని

మండవల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖోఖో బాలికల విభాగంలో కృష్ణాజిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు మండవల్లి మండలం లోకుమూడి విద్యార్థిని కొత్తూరు మహి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థినిని వ్యాయామోపాధ్యాయుడు, బి వేణుబాబును ఎస్ఎంసీ ఛైర్మన్ బి. సునీత, సర్పంచ్ కరేటి నాగమణి అభినందించారు. ఈమె అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుంది.

పూజలు, వనసమారాధనలు



కైకలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మీ అమ్మవారి 17వ వార్షికోత్సవం సందర్భంగా కార్తీక వనసమారాధనను నిర్వహించారు. గురువారం కైకలూరు మండలం ఆటపాక అగ్రహారం రోడ్డులోని వాటర్ ట్యాంక్ వద్ద అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట : కామినేని


సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దానిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరులో నియోజకవర్గంలోని 11 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా వైద్య ఆరోగ్యానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, పొత్తూరు వాసురాజు, పూల రామచంద్రరావు, వలవల రామారావు, చెరుకువాడ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ అందరి బాధ్యత


బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం

మునునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి జి.రాగసుధ అన్నారు. గురవారం గోపవరం జడ్పీ పాఠశాలలో చైల్డ్‌లైట్స్ అడ్వకసీ ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమం వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాగసుధ మట్లాడుతూ ఆడపిల్లకు 18 ఏళ్ళు, మగ పిల్లలకు 21 ఏళ్ళు నిండకుండా వివాహం చేస్తే నేరమని అన్నారు. బాల్య వివాహాలు, బాలికల సమస్యలపై చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, టోల్ ఫ్రీ నంబర్ 112 లకు సమాచారం ఇవ్వాలన్నారు. క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, హెచ్‌ఎం నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

కలిదిండి: బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు గురువారం అడ్డుకున్నారు. గోపాలపురం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడితో అదే గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక కొంతకాలంగా వాట్సాప్ ద్వారా చాటింగ్ చేసుకుంటూ ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరికి వివాహం చేయాలని వారి తల్లిదండ్రులు నిర్ణయించుకుని గురువారం పెళ్లి చేయటానికి ముహూర్తం ఖరారు చేశారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు, తహసీల్దార్ రామకృష్ణ బాల్య వివాహాన్ని అడ్డుకుని వారి తల్లిదండ్రులకు బాల్య వివాహం వల్ల కలిగే అనర్థాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలుడు, బాలికను ఏలూరు బాలబాలికల సంరక్షణ కేంద్రానికి తరలించామని సీడీపీవో దీప్తి తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల గౌరి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, మహిళా పోలీసు శరణ్య పాల్గొన్నారు.



గోపవరంలో నిర్మాణం పూర్తికాని సచివాలయ భవనం.. చింతలపల్లిలో పునాది దశలో హెల్త్ క్లినిక్ భవనం

నిర్మాణాలు పూర్తయ్యేనా..?

ప్రజల వద్దకే పాలన పేరుతో గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో నూతన భవనాలకు శ్రీ కారం చుట్టి, సొంత పార్టీ నాయకులకే అప్పగించినా ఐదేళ్ల పాలనలో భవన నిర్మాణాలను పూర్తిచేయలేదు. మధ్యలోనే కాంట్రాక్టర్లు నిర్మాణాలను వదిలివేయడంతో పలు గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

- గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వమైనా పూర్తిచేయాలని ప్రజల విజ్ఞప్తి

మునునూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా 16 డిజిటల్ లైబ్రరీలు నిర్మించాల్సి ఉండగా ఒక్క లోపూడిలో మాత్రమే వినియోగంలోకి రాగా, మిగిలిన 15 గ్రామాల్లో గత ప్రభుత్వ పాలనలో భూమిని కూడా కేటాయించలేదు. అలాగే 13 హెల్త్ క్లినిక్ భవనాలకు గాను రెండు వినియోగంలోకి రాగా 11 భవనాలు పునాది దశలోనే నిలిచిపోయాయి. 8 అమూల్ పాల కేంద్రాల భవనాలకు గాను ఒక్కటి మాత్రమే వినియోగంలోకి రాగా మిగిలిన 7 భవనాలకు శంకుస్థాపనలు జరగలేదు. మూడు సచివాలయ భవనాలు స్లాబ్‌లు వేసి వదిలివేశారు. మూడు ఆర్బీకే భవనాలు సైతం స్లాబ్ దశలో ఉన్నాయి. వేల్పుచర్ల గ్రామంలో ఐదు ప్రభుత్వ భవనాల్లో ఒక్కటి కూడా పూర్తిచేయలేదు. కాంట్రాక్టర్లకు నాటి ప్రభుత్వం సక్రమంగా బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణాలు పూర్తికాలేదు. సగం సగం పనులు చేసి మధ్యలోనే వదలివేయడంతో ఈ భవనాలు పశువులు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. ఐదేళ్లలో కూడా పూర్తిచేయలేకపోతే భవన నిర్మాణాలను చేపట్టడం ఎందుకని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను కూటమి ప్రభుత్వం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన టెండర్లకు చర్యలు

గత ప్రభుత్వంలో నిలిచిపోయిన ప్రభుత్వ భవనాలను పూర్తిచేసేందుకు కూటమి ప్రభుత్వం నూతన టెండర్లకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపులు పూర్తయ్యాయి. టెం డర్ల ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణాలు పునఃప్రారంభిస్తాం.

- రేగళ్ళ దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ, మునునూరు మండలం.

నరసాపురానికి వందే భారత్

» రైల్వే శాఖ ఉత్తర్వులు » ఫలించిన కేంద్ర మంత్రి వర్మ కృషి

భీమవరంటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పార్లమెంటు నియోజకవర్గానికి తొలి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందు బాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు చెన్నై (ఎంజీఆర్ చెన్నై సెంట్రల్) నుంచి విజయవాడ వరకు నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్లు 20677/20678)ను నరసాపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వేకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వందే భారత్‌ను నరసాపురం ప్రాంతానికి తీసుకు రావడం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే ఉన్నతాధికారులతో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి వర్మ పలుమార్లు సమావేశమై నరసాపురం ప్రాంతానికి వందే భారత్ ఆవశ్యకతను బలంగా తెలిపారు. ఈ రైలు పొడగింపుతో పశ్చిమగోదావరి జిల్లా వాసులతోపాటు కోనసీమ వాసులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. ఈ మార్గంలో గుడివాడ, భీమవరం టౌన్ స్టేషన్లలో వందే భారత్ ఆగుతుంది. చెన్నైలో ఉదయం 5-30కు బయలుదేరే రైలు నెం. 20677 రేణి గుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి స్టేషన్లో ఆగుతూ విజయవాడలో 11-45 గంట లకు చేరుతుంది. మధ్యాహ్నం 12-34కు గుడి వాడ, 1-29కు భీమవరం టౌన్ చేరుకుని మధ్యా హ్నం 2-10కు నరసాపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో నరసాపురం నుంచి నెం. 20678 రైలు మధ్యాహ్నం 2-50కు బయలుదేరి 3-19 గంటలకు భీమవరం టౌన్, 4-09కి గుడివాడ చేరుకుని, 4-50కు విజయవాడ కు చేరుకుని చెన్నైకు రాత్రి11-45కు చేరుతుంది. అధికారిక ప్రారంభ తేదీ త్వరలో తెలియజేయనుంది.


చాట్రాయి శివాలయంలో జ్వాలాతోరణం

వైభవంగా జ్వాలాతోరణం

చాట్రాయి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా చాట్రాయి శివాలయంలో బుధవారం రాత్రి జ్వాలాతోరణం, దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి జ్వాలాతోరణం చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేశారు. ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అధికారులు సమయ పాలన పాటించాలి

కలిదిండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ అధికారులు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర తెలిపారు. పలు గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పెదలంక గ్రామ సచివాలయంలో సిబ్బంది సమయ పాలన పాటించకపోవటంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇన్‌చార్జ్ అధికారులు కావటంతో సక్రమంగా రావటం లేదని పలువురు ఫిర్యాదు చేశారన్నారు. సమయ పాలన పాటించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఫ్యాన్లు బహూకరిస్తున్న దృశ్యం

అంగన్వాడీ కేంద్రానికి సర్పంచ్ ఫ్యాన్ల వితరణ

మండవల్లి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండవల్లి పంచాయతీ పరిధిలో అంగన్వాడీ 6వ నెంబర్ సెంటర్‌కు మెండా హిజ్కియా, తెరిసా జ్ఞాపకార్థం రెండు సీలింగ్ ఫ్యాన్‌లను సర్పంచ్ గురువారం వితరణ చేశారు. ఈ మేరకు ఆ కేంద్రానికి ఫ్యాన్లను అందజేశారు.

క్రైమ్ కార్నర్

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. వివాహితకు వేధింపులు

ముదినేపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడు తమ గ్రామానికి వచ్చి తనను వేధిస్తూ ఇబ్బందులకు గురి చేసినట్లు ముదినేపల్లి మండలం వాడవల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. సుమారు రెండు నెలల క్రితం వాడవల్లికి చెందిన వివాహితకు కైకలూరు మండలం వేమవరప్పాడుకు చెందిన ఎస్. శివరామకృష్ణ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అనంతరం ఆ యువకుడు వాడవల్లి వచ్చి ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించడం ప్రారంభించాడు. వారం రోజుల క్రితం ఆమె గ్రామంలోని పంటకాల్వలో బట్టలు ఉతుకుతుండగా శివరామకృష్ణ వచ్చి అసభ్యంగా ప్రవర్తించి బెదిరించాడు. ఈ విషయం ఆమె భర్తకు చెప్పగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

కైకలూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడిన ఇద్దరు యువకులకు 7 నెలల 19 రోజులు జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి గురువారం తీర్పునిచ్చారు. కైకలూరు టౌన్ పోలీసుల వివరాల ప్రకారం ఈ సంవత్సరం జనవరి 17న కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో నివశిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ పోతురాజు ఆదినారాయణరావు అద్దెకు ఉంటున్న ఇంటిలో తాళం వేసి ఊరుకు వెళ్లారు. ఆ సమయంలో ఇంటి తలుపులు పగలగొట్టి ఇంటిలోని నగదు రూ.30 వేలు అపహరించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకట్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరానికి పాల్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, ఏలూరు జిల్లా కలిదిండి మండలం చిన్నతాడినాడ గ్రామానికి చెందిన ఓలేటి దుర్గామల్లేశ్వరరావు కలిసి చోరీకి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేశారు. వీరిని అప్పట్లో కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. రిమాండ్ సమయంలో వారు 7 నెలల 19 రోజులు జైలు శిక్షను అనుభవించారు. కోర్టులో వాదోపవాదనలు జరిగిన మీదట నేరాన్ని అంగీకరించడంతో వారు రిమాండ్ కాలంలో అనుభవించిన జైలు శిక్షను సాధారణ జైలు శిక్షగా పరిగణించి ఒక్కొక్కరికి రూ.200 జరిమానాన్ని విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో కైకలూరు టౌన్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ, ఎస్సై వెంకట్‌కుమార్‌లు చట్టపరమైన విషయాలు కోర్టుకు అందజేశారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

కలిదిండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనటంతో దివ్యాంగుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. కోట కలిదిండికి చెందిన బైలపాటి వాకాలయ్య (38) మూడు చక్రాల స్కూటీపై ఈ నెల 3న భోగేశ్వరస్వామి ఆలయం నుంచి కలిదిండి వస్తుండగా, వెనుక నుంచి కారు ఢీకొనటంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతనిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.